# పూర్ణాహుతి

తమోమయమైయున్న జగత్తులో ప్రాగ్దిశాముఖాన వెల్గురేఖ వెల్లివిరిసింది. ఉదయ భాస్కరుడు ప్రాగ్దిశను తన దివ్య కాంతుల సోహణింపులతో పావణించినాడు.

అయ్యుష స్సుషమా సుభగమైన శుభ సమయాన రామశర్మ యింటివెనకాల గోస్థానకమున ఏదో అలికిడయింది.

'అంబా'యని బాధతో నిండిన అరవు గుండెలను జలదరింప జేసింది! ...

అది నిండు చూడి యావు ఆర్తనాదం! ...

గోమాంస భక్షకులైన యవన సైనికులకు పట్టుబడ్డ ఆ గోవు రామశర్మవేపు దీనాతిదీనంగా చూస్తూ "అంబా"యని విలపించింది.

చూడి యావుల గర్భస్థ పిండాలను తినమరిగిన పరమ దుర్మార్గులైన యవన సైనికులకు చిక్కిన తన గోవునిక దక్కించుకొనుట దుర్లభమని రామశర్మకు తెలుసు.

అయినా ఆ యవన సైనికులకు నమస్కరించి "పరమ పవిత్రమైనదిగా భావించి ప్రాణప్రదముగా పెంచుకొంటున్న గోవిది. మా సర్వస్వం యిదే! దయతలచి వదిలిపెట్టండి" అని ప్రార్థించేడు.

దయదల్చడమెలాగో వాళ్ళలో ఏ ఒక్కళ్ళకీ తెలీదు!

రామశర్మ పిలక పట్టుకొని కుత్తుక నుత్తరించడానికి కత్తి నెత్తేడొక యవన సైనికుడు.

ఈ భయంకర దృశ్యాన్ని కిటికీలోనుంచి చూసి భయ విహ్వలమై 'అమ్మో'యని ఓ గావు కేక వేసింది రామశర్మ అనుంగు కూతురైన పార్వతి.

అంతా చూసేరటువేపు!

కంట బడింది అపురూప లావణ్యావతైన పార్వతి.

రాక్షసత్వపు టుద్రేకముతో యింట జొరబడ్డాడొక యవన సైనికుడు. తన దుర్మాంస భుభుక్షు రాక్షస కరాల మధ్య పార్వతిని బంధించి బయటకు బలవంతముగా లాక్కొచ్చేడు.

ఆ సైనికుడి బంధంలోంచి విడివడడానికి తీవ్రంగా పెనగులాడుతున్న తన కుమార్తెనుచూసి అవమాన భారంతో కుత కుత ఉడికిపోయాడు రామశర్మ. శక్తినంతా కూడగట్టుకొని తన పిలక పట్టుకొనివున్న సైనికుడి డొక్కలో ఒక్క తాపు తన్ని, ప్రక్కనేవున్న గొడ్డలితీసి తన కుమార్తెను పట్టుకొని వున్న సైనికుడి మీదికి ఒళ్ళు తెలియని క్రోధావేశాలతో లంఘించేడు.

ఖండింపబడి క్రిందకు తెగి పడింది శిరస్సు!

అది రామశర్మ శిరస్సు!...

"నాన్నా" అని బిగ్గరగా అరచి సొమ్మసిలిపోయింది పార్వతి!...

ఆమెను భుజాన వేసుకొని దారితీసే డొకడు!...

ఘోష పెడుతున్న గోమాతను బాదుతూ తోలుకు పోయారు మిగిలినవాళ్ళు.

నదికి నీటికని వెళ్ళిన రామశర్మ భార్య భారతీదేవి యింటికి తిరిగొచ్చేటప్పటికి యీ ఘోరకృత్యమంతా జరిగి పోయింది.

ఆ నాడా గ్రామములోను, ఆ చుట్టు పక్కనున్న గ్రామాలలోను యిటువంటి దౌర్జన్యాలెన్నో జరిగేయి.

ఆ గ్రామస్థుల హృదయాలు ఆగ్రహావేశాలతో భగ్గు భగ్గున ప్రజ్వరిల్ల సాగాయి. కంటబడ్డ యవన సైనికుల నందరినీ హతమార్చాలనుకున్నారు.

దుర్దమనీయమైన యవనుల సేన తమ రాజధానిఅయిన మళకావతీ పురంలో తిష్ఠ వేసుకొనివున్న సమయంలో ఆగ్రహావేశులైయున్న తమ గ్రామములోని యువకులు యుద్ధ నిపుణులైన యవన సైనికులను ఎదిరించినట్లయితే తమ గ్రామము యావత్తూ యవన సైనికులచే సర్వనాశనం చెయ్యబడుతుందేమోనని భయపడ్డారు అనుభవజ్ఞులైన కొందరు పెద్దలు. యువకులలో పెల్లుబికిన ఆగ్రహావేశాలను క్రమబద్ధం చెయ్యాలనే తలంపుతో ఆ రాత్రి నారాయణశిరోమణిగారి యింటి వాకిట్లో ఒక రహస్య సమావేశం యేర్పాటు చేసేరు.

అదొక పెద్ద నాలుగిళ్ళ భవంతి. మధ్యగల వాకిలి వెయ్యిమంది విశాలంగా కూర్చోడానికి సరిపోయేటంత పెద్దది.

సుమారు పదిహేను వందలమంది సభకు విచ్చేయడంవల్ల అంతా కిక్కిరిసి కూర్చోవలసి వచ్చింది! ... విశేషత ఏమిటీ అంటే పిలవకపోయినా కొంతమంది స్త్రీలుకూడా విచ్చేశారు! ... వరండాలన్నీ స్త్రీలచే ఆక్రమించబడ్డాయి.

నారాయణ శిరోమణిగారు అధ్యక్ష స్థానాన్ని అలంకరించేరు. చీమ చిటుకుమన్నా వినిపించేటంత నిశ్శబ్దంగావుంది సభాస్థలి.

ప్రార్థనానంతరం నారాయణ శిరోమణిగారు సభాసదుల నందరినీ ఓ మారు కలయజూసి గంభీర స్వరంతో "ధర్మ రక్షా దీక్షా కంకణ ధారులైన ఓ సభాసదులారా!" అని సంబోధించి "ఏ స్వధర్మ రక్షణకోసం మనం పాటుపడుతున్నామో ఆ స్వధర్మం యవనులచే నాశనం చెయ్యబడుతోంది. ప్రస్తుతం దైవం యవనులకు అనుకూలంగా వున్నాడు. అంచేతే వాళ్ళు క్రమక్రమంగా మన దేశంలోకి చొచ్చుకు రాగలుగుతున్నారు. యవనుల కీరకమైన విజయం చేకూర్చడానికి స్వధర్మ భ్రష్టులు నీచులు అయిన మన హిందూరాజులు కొందరు తోడ్పడ్డారని చెప్పడానికి ఎంతో సిగ్గుగావుంది!

తక్షశిలేశ్వరుడైన సుబాహువు, అతని కుమారుడైన అంభి – తన విరోధులైన అభిసార పురుషోత్తములను యవనుల సహాయంతో నిర్జించాలనే నీచాతినీచమైన స్వార్థంతో సిగ్గెగ్గులను విడచిపెట్టి యవన చక్రవర్తియగు అలగ్జాండరుకు శరణాగతులయేరు. దేశ సరిహద్దులలో యిటువంటి స్వార్థ

పరులు అవివేకులు వుండడంవల్లే మనకీ నాడీ కష్టాలొచ్చేయి. భారతదేశచరిత్రలో నీచాతినీచులగురించి చెప్పవలసొచ్చినపుడు ముందుగా వీరిని పేర్కొనవలసుంటుంది. సరిహద్దులలో స్వధర్మ భ్రష్టులు, పౌరుషవిహీనులు అయిన యిటువంటి నీచ ప్రభువులు కొందరుండబట్టే అలగ్జాండరు వ్యాసనదీ తీరము వరకూ పురోగమించగలిగేడు.

అతులిత శౌర్య ధైర్యసంపన్నుడైన మన అశ్వకరాజ్య ప్రభువు అశ్వజిత్తు యవన పతిని అతి ధైర్య సాహసాలతో ఎదుర్కొని వీరోచితంగా పోరాడేడు. కాని యవనులు కుటిల యుద్ధ పద్ధతుల నవలంభించి మూక వుమ్మడిగా మన ప్రభువుపై బడ్డారు. మన ప్రభువు నేలకొరుగిపోతూ – "స్వధర్మ రక్షణ కోసం ప్రాణం ఉన్నంతవరకూ పోరాడండి!" అని సందేశమిచ్చి వీర స్వర్గాన్ని అలంకరించేడు! ... ఆ తనువాత రాజ మహిషియైన కలాపినీదేవి యవన సేనాధిపతులలోఒకడైన ఫిలిప్‌చే బంధించబడింది. ఇంత జరిగినా అధైర్యం చెందక మన సేనాధిపతి విజయవర్మ అతి నేర్పుగా ఉర్ణాశ దుర్గాన్ని చేరి అక్కడ నుంచి యవన సైనికులను మరి ముందుకు పోనివ్వకుండా నిలవరించేడు. ఎంతోమంది యవన సైనికులను యమపురి కంపేడు.

వాళ్ళలో నిరాశానిస్పృహ లలముకొన్నాయి. యుద్ధం చేసి విజయవర్మను జయించడం అసాధ్యమని భావించి ఓ కుటిలోపాయాన్ని పన్నేడు యవన సేనాని!... తనకు బందీగా

చిక్కిన కలాపినీదేవిని మంచిమాటలతో చేరదీసి, తన వేష భాషలతో, అంద చందాలతో ఆమెలో అణగి మణగివున్న కామోద్రేకాన్ని రెచ్చగొట్టి ఆమెను వశపరచుకున్నాడు. అతని సౌందర్యాన్ని గాంచి మోహాంధురాలై మన రాణీ కలాపినీదేవి అతనికి లొంగిపోయింది.

యువన సౌందర్యానికి, నాగరికతకు మురిసిపోయి మానావమానాలను మంటగలిపి క్షుద్రమైన కామానికిలోనైన రాణీగారి ఆజ్ఞను దేశ శ్రేయస్సు దృష్ట్యా మన సేనాధిపతి విజయవర్మ తలదాల్చవలసిన అవసరం యదార్థానికి లేదు! ... కాని రణరంగంలో రాజు మరణించేక రాణీ ఆజ్ఞలను శిరసా వహించడం ధర్మమనే అభిప్రాయంతో మన సేనాధిపతిగారు పోరు విరమించేరు. ధర్మాన్ని సర్వత్రా యథావిధిగా అనుసరించాలని కొంతమంది పెద్దల అభిప్రాయం! ... నిజమే! ... కాని ధర్మానుష్ఠానంకోసం శత్రువులకు లోబడిపొమ్మని మన ధర్మ శాస్త్రాలలో ఎక్కడా లేదు. శత్రువుల కుటిలోపాయాలు తెలిసికూడా శత్రువులకు లోబడిపోవటం ధర్మరక్షణ మనిపించుకోదు! ... అది ధర్మ భక్షణమవుతుంది. మనవాళ్ళయొక్క ధర్మానుష్ఠాన పరాయణత్వం అంధ విశ్వాసాలకు లోబడి ఈ రకంగా వెర్రి తలలు వేయబట్టే మన కర్మభూమి కర్మ ఖులా తగలడుతోంది.

ఇప్పుడు నేను చెప్పిన విషయాలు మీలో చాలా మందికి తెలిసే ఉండొచ్చు. అయినా యిదంతా ఎందుకు

చెప్పానూ అంటే ప్రస్తుతం మనం ఏ పరిస్థితిలో ఉన్నామో తెలియజెయ్యడానికి.

యవనుల దౌర్జన్యా లంతకంతకు అధిక మవుతున్నాయి. వీటిని అరికట్టేందుకు యికముందు మనము ఏమి చెయ్యాల్సి వుంటుందో నిర్ణయించుకొనేటందుకే మనమీ నాడిక్కడ సమావేశమయేము.

మన రాణీ అయిన కలాపినీదేవి మోహాంధురాలై యవన సేనాధిపతి అయిన ఫిలిప్‌కి వశీభూతురాలైంది. ఆమెను అభిమానించే ప్రజలు మన దేశములో యింకా చాలా మందున్నారు. ప్రస్తుతం పరిస్థితులు మనకంత అనుకూలంగా లేవు. అదీగాక సైనిక శిక్షణ పొందిన యువకులు మనలో అట్టే లేరు. ఇటువంటి పరిసితిలో యుద్ధనిపుణులైన యవనులను ఎదిరిస్తే అగ్నిలోబడ్డ శలభాలకువలె మాడిపోవడం మినహాయిస్తే ప్రయోజన మేమీ వుండదు. అందుచేత 'తావత్కాలం ప్రతీక్ష్యతాం' అనే ధర్మాన్ని మన మిప్పుడు ఆశ్రయించక తప్పదు! ... ఈలోగా హైందవ ధర్మాన్ని రక్షించమని ప్రార్థించేటందుకై ప్రముఖులైన కొంతమంది ధర్మశాస్త్ర పారంగతులను ఫిలిప్ వద్దకు, రాణీ కలాపినీదేవి వద్దకు పంపించడం ఉచితమైన పద్ధతని ఈ సభలోవున్న కొంతమంది పెద్దల అభిప్రాయం!

ఈ స్థితిలో మనం ఆవేశానికి లోనయినట్లయితే మన పరిస్థితి మరింత అధ్వానమైపోతుంది. అంచేత బాగా ఆలోచించి

మీ అభిప్రాయాన్ని తెలియజేయండి. మీ మౌనం అంగీకార ముగా భావించబడుతుంది.' అని పలికి కూర్చున్నారు నారాయణ శిరోమణిగారు.

అంతట క్రోధారుణమైన ముఖంతో అరుణ భాస్కరుని నుంచి వెలువడిన ఓ దివ్య తేజస్సులాగ ఓ మూలనుండి రామ శర్మ భార్యయగు భారతీదేవి సభాధ్యక్షులవారి దగ్గరకు వచ్చి ఈ సభలో కొన్ని విషయాలను మాట్లాడేందుకు తనకు అనుమతి నివ్వమని అధ్యక్షులవారిని ప్రార్థించింది.

పరిస్థితిని గమనించి సమయోచితంగా మాట్లాడమని అనుజ్ఞ నిచ్చేరు అధ్యక్షులవారు.

భారతీదేవి శక్తినంతా కూడగట్టుకొని బిగ్గరగా-'ఆర్య సభాసదు లందరికీ నమస్సులు! ... యవనుల ఘోరకృత్యాలకు గురికాబడ్డ అనేకమంది స్త్రీలలో నేనుకూడా ఒకతెను! ... నాకు జరిగిన అన్యాయానికి నేనిప్పుడంతగా విచారించలేదు. కాని పరమ ఛండాలిని అయిన కలాపినీదేవిని, పరమ కర్కో-టకుడైన యవన ప్రతినిధిని ధర్మభిక్ష పెట్టమని ప్రార్థించాలని యీ సభలోని పెద్దలు తీర్మానించినందుకు నేను చాలా విచా రిస్తున్నాను.

మన అశ్వక రాజ్యములోవున్న వృద్ధులయొక్క, స్త్రీలయొక్క, బాలబాలికలయొక్క, గోవులయొక్క శ్రేయస్సుకోసం పరమదుర్మార్గుడైన యవన ప్రతినిధిని ప్రార్థించ

డమే యిక గత్యంతరమనే అభిప్రాయంతో ఈ సభలోవున్న యువతీ యువకులు ఏకీభవిస్తారనీ నేననుకోను!... మన దేశములోవున్న లక్షలాది యువకులు గాజులు తొడుక్కుని కూర్చున్నారా? స్త్రీ బాల వృద్ధులను, మన పవిత్ర దేవాలయములను, గోవులను రక్షించడానికి వెనుకంజ వేసేటంత పిరికి పందలా ఈ దేశపు యువకులు?

మన రాణి కలాపినీదేవి తుచ్ఛము, నీచము అయిన యింద్రియ సౌఖ్యాలకోసం, భోగలాలసత కోసం స్వధర్మ భ్రష్టురాలై మానావమానాలను సిగ్గెగ్గులను విడిచిపెట్టి యవన ప్రతినిధి సోయగానికి వ్యామోహితురాలై అతని కౌగిలిలో కులుకుతోంది!... అట్టి నీచురాలిని ప్రార్థించేటందుకై ఆమె దగ్గరకు వెళ్ళడానికి మన పెద్దలలో కొంతమంది సంసిద్ధంగా వున్నారంటే అంతకన్నా అవమానకరమైన విషయం యింకొకటేదీ వుండదు.

ఒకవేళ యవన ప్రతినిధి అయిన ఫిలిప్ మీ ప్రార్థనను మన్నించకపోతే మీరేం చెయ్యదల్చుకున్నారు? – గోమాంస భక్షకులైన యవనులు ఇంద్రియ సౌఖ్యాలకు, అవినీతికి బాగా అలవాటుపడ్డారు. మన ప్రార్థనను మన్నించగలిగే స్థితిలో వారిప్పుడులేరు. చూడి యావుల గర్భస్థ పిండాలను తిన మరిగేరు వాళ్ళు. కంటబడ్డ హిందూ స్త్రీలను బలాత్కరించి మానభంగం చెయ్యడం వాళ్ళకి వినోదప్రాయముగావుంది. వాళ్ళ రాక్షస కృత్యాలకు లోబడక పెనగులాడే సాధ్వీమణుల

శిరోజాలు మొదలంట కోసి అపహాస్యం చేస్తూంటే కిక్కురు మనకుండా నోరుమూసుకొని పడివుండడం నేర్చుకున్న మగ ధీరులు మీరు! వశపడని స్త్రీలను వివస్త్రలనుగాజేసి జడలు పట్టి నడి వీధులలో ఈడుస్తుంటే పౌరుషవిహీనులై సిగ్గూ సిరమూ లేకుండా ఆ మూర్ఖులకు చేయెత్తి నమస్కరించడం అలవాటుచేసుకున్న మహావీరులు మీరు! ఛీ ఛీ సిగ్గు సిగ్గు!

మన జాతి యీనాడింత పౌరుషవిహీనంగా పడివుండ డానికి కారణం కొంతమంది మన పెద్దలయొక్క అవివేకమే! మన పెద్దలలో కొందరు జాతిని నీరసపరచి నిర్వీర్యంచేసే భావాలను కొన్నింటిని ప్రచారం చేస్తూండడంవల్లే మన మీ నాడీ స్థితిలో వున్నాం! ...

ఇహ లోకం, పర లోకం అంతా మిథ్య అవడంవల్ల అందలి సుఖంకూడా మిథ్యేనని, ఇంద్రియాలద్వారా లభించే సమస్త సుఖాలు ప్రకృతి నియమాలకు లొంగివుంటాయిగనుక అవన్నీ మిథ్యేనని - అందుచేత మానవులు వాటికి దాసులు కాక భవ బంధ విముక్తికై ప్రయత్నించి మోక్షం పొందాలని అదేపనిగా ప్రచారం చేస్తున్నారు కొంతమంది! ...

నిజమే! ... జీవితానికి మోక్షమే లక్ష్యమని నేనూ అంగీకరిస్తాను. కాని మోక్షాన్ని కాంక్షించేవాళ్ళు స్వధర్మాన్ని పరిపూర్ణంగా అనుష్ఠించాలి. స్వధర్మ భ్రష్టులకు మోక్షం సిద్ధించదు. ధర్మం అంటే ఏమిటో తెలుసా? ... ఈ లోక

ములోగాని, పర లోకములోగాని సుఖాన్ని అపేక్షించేవాళ్ళు ఆచరించవలసే దేదయితేవుందో అదే ధర్మం! ... ధర్మము యెప్పుడూ క్రియా పర్యవసాయియే అవుతుంది. అది సుఖార్థు లగు మానవులచే నిర్విరామంగా కృషి చేయించి అభ్యుదయ పథంవేపు పురోగమింప జేస్తుంది.

అహింస పరమోత్తమమైన ధర్మమే! ... శాంతియుత సహజీవనం వాంఛనీయమే! ... కాని మనల్ని మన మతాన్ని మన జాతీయతను, మన దేశాన్ని సర్వ నాశనంచేసే సంకల్ప ముతో సరిహద్దులనుదాటి విదేశీయులు మన దేశములోనికి చొచ్చుకువస్తూంటే "ఇదంతా మిథ్య, జయించడం, జయింప బడడం అంతా అశాశ్వతం; మన లక్ష్యం మోక్షమేకాని రాజ్య పరిపాలన, భోగలాలసత కాదు." అని చెప్పే పెద్దలు భగవద్గీతను సవ్యంగా అర్థం చేసుకోలేదనే చెప్పాలి!

శతృత్వులు లేనివాడు, అందరితోను మైత్రికలిగి కరుణా మయుడై యుండేవాడు, అహంకార మమకారాలు లేనివాడు, సుఖం వచ్చినా, దుఃఖం వచ్చినా స్వార్థం చెడనివాడు, క్షమా శీలి — ఈరకమైన లక్షణాలు కలవాడే మోక్షానికర్హుడని భగవద్గీతలో చెప్పబడింది.

మనకీ ప్రపంచంలో శత్రువులున్నాగుగనుక మోక్షాన్ని పొందే అర్హత మనకిలేదు. శత్రునిశ్శేషుల మైననాడే మోక్షం గురించి ప్రయత్నించే అర్హత మనకు సిద్ధిస్తుంది.

దురదృష్టవశాత్తూ యీనాడు మనలో కొంతమంది అజ్ఞానులు యవన నాగరికత మన నాగరికతకంటే విశిష్టమైన దని భావిస్తున్నారు. మనమేదో బానిసత్వంలో క్రుంగిపోతు న్నట్లుగా భావించి యవన సేనను జాతీయ విమోచన సేన యని ప్రచారంచేసి దానికి స్వాగతం పలికేరు అంభివంటి నీచాతి నీచులైన స్వార్ధపరులు! ... దేశ క్షేమం దృష్ట్యా యిటువంటి స్వార్ధపరుల్ని మొదట అంతమొందించాలి.

మన హిందూమతాన్ని వదలి ఇతర మతాలను కొంత మందీనాడు స్వీకరిస్తున్నారు. ఇందుకు స్వార్ధపరులు, అజ్ఞానులు మూర్ఖులు అయిన కొంతమంది హైందవ మతాధిపతులే కారకు లని నా అభిప్రాయం!

అగ్ర కులాలు, వెనుకబడిన కులాలు, నీచ కులాలు అనే విభజన హిందూ మతానికే కాక దేశ శ్రేయస్సుకే భంగకరం! రాచకార్యాలు సక్రమంగా నిర్వహించడానికి యేర్పడ్డ శాఖలే యీ కులాలు. వీటిలో ఎక్కువ తక్కువలు లేవు. అన్ని కులాలవారూ సమానులే! ... భారతమాత అందించే సర్వ సౌఖ్యాలను అనుభవించేటందు కందరికీ సమానమైన అర్హతే వుంది.

దురదృష్టవశాత్తూ బ్రాహ్మణ అబ్రాహ్మణ విభేదా లను కొంతమంది కోరుండి సృష్టిస్తున్నారు. ఇది చాలా విచార కరమైన విషయం! ... ఎట్టివానిని బ్రాహ్మణు డంటారో తెలుసా? ... సత్యమైన పరమార్ధ జ్ఞానం సంపూర్ణంగావున్న

వ్యక్తిని బ్రాహ్మణుడంటారు. కులాలతో నిమిత్తం లేకుండా బ్రాహ్మణత్వం పొందడానికి ప్రతి వ్యక్తికీ అర్హతవుంది. వేద విధులను సక్రమంగా పాటిస్తూ ఆధ్యాత్మికాభ్యుదయం పొంది ప్రగతి పథంలో పురోగమించి ఆదర్శనీయమైన బ్రాహ్మణ త్వాన్ని పొందేటందుకు భారతీయులంతా శక్తివంచన లేకుండా కృషిచేసినట్లయితే ఈ వర్ణవిభేదాలన్నీ వాటంతటవే అంతరించి మళ్ళీ సత్యయుగంలోలాగ ఒకే ఒక ఉత్తమ వర్ణం భారత దేశంలో ఆదర్శవంతముగా నెలకొల్పబడుతుంది!

ఏమిటో నేను అసలు విషయాన్ని వదిలిపెట్టి లేనిపోని వన్నీ చెపుతున్నట్లున్నాను. నా ధోరణి మీకు విసుగుని, జుగు ప్సను కల్గించవచ్చు! ... అయినా మీలో ఏ కొద్దిమందికైనా నా యీ భావాలు తలకెక్కితే నాకంతే చాలు! ...

మరో విచారకరమైన విషయ మేమిటీ అంటే; భయం వల్లో, స్వార్థంవల్లో, అవివేకంవల్లో కొందరు హిందువులు యవనులకు తమ కన్యలనిచ్చి వియ్య మొందుతున్నారు. సాటి హిందువులతో వివాహ వ్యవస్థకు అడ్డొచ్చే కుల భేదాలు గోమాంస భక్షకులైన యవనులతో వివాహ బాంధవ్యాలకు అడ్డురావు కాబోలు! ధర్మ పటిష్ఠమైన హిందూ మనస్తత్వం ఎంత క్రిందకు దిగజారిపోయిందో చూడండి. ఇది చాలా సిగ్గు చేటైన విషయం. యవన రక్తం అధికంగా హిందూ జాతిలోకి ప్రవేశించినట్లయితే హిందువులలో జన్మతః యవన జాతీయ భావాలు యేర్పడి యవన సంస్కృతి చిరస్థాయిగా మన

దేశంలో నిలచిపోతుంది. హైందవ సంస్కృతి శాశ్వతముగా యీ దేశంలో నశించిపోతుంది. దానితోపాటే మన జాతీయతకూడా మంటగలిసిపోంది. జాతీయతను పోగొట్టుకున్న జాతి పరమ జుగుప్సాకరమైన బానిసత్వానికి లోనవుతుంది!...

అంచేత ఓ ఆర్యావర్తపు వీర యువకులారా! లేవండి! శత్రు మూకలను చెండాడండి. దేశం నలుమూలలకు పోయి విప్లవ జ్వాలలను రేకెత్తించండి! మీ కర్తవ్యాన్ని నిర్వహించడములో అనవసరమైన జాప్యాన్ని చేసారంటే నరకానికిపోతారు. సందేహమే ఒక అభిశాపం! ... అంచేత యిక సందేహించకుండా స్వధర్మ రక్షణకోసం అందరూ నడుం కట్టండి! ...

యవనులు మన వేదాలను, శాస్త్రాలను తరలించుకుపోతున్నారు. ఏ శాస్త్రం పోయినా, ఏ వేదం పోయినా అంత యిబ్బంది లేదు. కాని అధర్వాణ వేదాన్ని యిక్కడనుంచి తరలించుకు పోయినట్లయితే యిహ మన సర్వస్వం నశించి పోయినట్లే!

ఆయుధ విద్య, మారణ యంత్రోత్పత్తి, సమస్త పారిశ్రామిక యంత్ర నిర్మాణవిధానం అంతా అధర్వాణ వేదములోనే వున్నదన్న సంగతి మీకు తెలియనిదికాదు. అది మన హిందులకు ప్రాణం వంటిది. అంచేత ఈ వేదాన్ని రక్షించుకోవలసిన బాధ్యత ప్రతి భారతీయుడిమీదా వుంది.

మన మహా పండితులను కొంతమందిని లోభపెట్టి, మోసగించి వారి దేశానికి తీసుకుపోతున్నారట! ... మన

భాషను వారిద్వారా నేర్చుకొని మన గ్రంథాలను వారి స్వభాషలోనికి అనువదించుకొని ఆ విజ్ఞానమంతా తమ స్వంతమేనని భవిష్యత్తులో చాటుకొంటారు కాబోలు! ... మన మహా పండితులలో కొంతమంది వారి ప్రలోభానికి వశపడడం మన దేశంయొక్క దురదృష్టమనే చెప్పాలి.

తనకు లొంగిరాని ప్రజ్ఞావంతులైన బ్రాహ్మణులను, తత్వ జ్ఞానులను, సన్యాసులను, శాస్త్రజ్ఞులను అలగ్జాండరు చాలా దారుణంగా అంతమొందిస్తున్నాడు. బ్రాహ్మణులంతా క్రాంతికారకులని తలచి వారికి ప్రాణదండన విధిస్తున్నాడట! ఈ దేశంలోగల తత్వజ్ఞానులు, సన్యాసులు ఏ పనీ లేకుండా వృధాగా తిరిగే దద్దమ్మలుకారనీ వీరి వాగ్ధార తనచే జయింపబడిన రాజ్యాలలో విప్లవ జ్వాలలను గుప్తంగా రగుల్కొల్పుతోందని గ్రహించే డలగ్జాండరు! ... అతను తగిన జాగ్రత్త పడకముందే సర్వత్రా విప్లవ జ్వాలలను ప్రజ్వలింపజెయ్యాలి!

అంచేత పౌరుషవంతులైన ఓ వీర భారతీయులారా! మీలో మీకున్న క్షుద్రమైన వైషమ్యాలను విస్మరించి స్వధర్మ రక్షణకోసం అందరూ ఏకమై పెనుగాలివలె చెలరేగండి! ... యవన సేనలను దూది పింజలవలె ఎగరగొట్టండి. ఆపదను చూచి భయపడడమంటే యౌవనాన్ని అవమానపరచడమన్నమాట! ... మీ మాతృదేశ కులస్త్రీల సౌభాగ్యం, కన్నె పడుచుల మానం, వృద్ధుల మర్యాద, బాలబాలికల అభ్యుదయం, గోవుల శ్రేయస్సు అన్నీ మీచేతిలో వున్నాయి!

చావుకు భయపడకండి ! ... పదండి ముందుకు ! ... ఈ దేశంలో ఎగురుతున్న యవన పతాకాలను తుత్తునియలు చేయండి. ఇందు కవసరమయే శౌర్య ధైర్యాలు మీకు లేక పోతే ఆ సంగతి సిగ్గువిడచి చెప్పండి ! ... అప్పుడు మా స్త్రీలు అందరూ ఏకమై యవనుల నెదిరిస్తాం !" అని వీరావేశంతో అందరి వేపూ కలయజూచింది భారతీదేవి.

అది ఉడుకు నెత్తురును రణరంగము వేపు ఉరకలు వేయించే భారతీయ పౌరుష వాణి ! ...

యువకులంతా ఉద్రిక్తులయ్యేరు !

వీరావేశంతో ఊగిపోతూ పిడికిళ్ళు బిగించి, పళ్ళు పట పట కొరుకుతూ "యవన సామ్రాజ్యం నశించాలి ! యవన సామ్రాజ్యం నశించాలి !" అని దిక్కులు పిక్కటిల్లేటట్టు నినదించసాగేరు.

ఆ యువకుల వీరావేశాన్ని చూసి సభలోగల అనుభవజ్ఞులైన పెద్దలు చాలా ఆందోళన చెందేరు. నిర్ణీతమైన పథకమేదీ లేకుండా హద్దుమీరిన ఆవేశముతో చెలరేగితే ప్రయోజన మేమీ వుండదు సరికదా అది తమ వినాశనానికే కారణభూత మవుతుందని వారి భయం !

భారతీదేవిచేత అతి తీవ్రంగా రెచ్చగొట్టబడ్డ ప్రజల ఆవేశాన్ని ఎలా క్రమబద్ధం చెయ్యడమో అవగతం కాలేదు సభాధ్యక్షులైన నారాయణ శిరోణిగారికి.

ఆవేశపరులైన ప్రజలవల్ల అవాంఛనీయమైన అనర్థ మేదయినా సంభవిస్తుందనే భయముతో భారతీదేవి వేపు ఆందోళనతో చూస్తూ - "అమ్మా ... భారతీ! ... నువ్వు చెప్పినది సత్యంకాదని నేననను. కాని ఒక నిర్ణీతమైన పథక మేదీ లేకుండా ప్రజల్ని రెచ్చగొట్టి విప్లవ జ్వాలల్ని రేకెత్తించి నందువల్ల ప్రయోజనమేమీ ఉండదు. అంచేత తగిన పథకాన్ని నిర్ణయించేటంతవరకూ ప్రజలలో రేకెత్తించబడ్డ ఈ ఆవే శాన్ని ఎలాగైనా నువ్వే అదుపులో వుంచాలి!" అన్నారు.

"అది నా పనికాదు!" అంటూ భారతీదేవి వేదిక దిగి గబగబా వెళ్ళిపోతుంటే - 'అమ్మా!' అనే పిలుపు వెనుక నుంచి వినిపించింది.

భారతీదేవితోపాటు సభాసదు లందరూ అటువేపు తిరిగి చూసేరు.

సౌందర్యవంతులైన ఆ యువకు లెవరు? ... ఏ ఊరి వాళ్ళు? వాళ్ళొచ్చి ఎంతసేపయింది? ... ఎందుకొచ్చే రిక్క-డికి? ... గూఢచారులు కాదుగదా? ...

ముఖ పరిచయంలేని వ్యక్తుల్ని లోనికి రానివ్వవద్దని ఆ యింటి ముఖద్వారం వద్దగల కార్యకర్తలకు ముందుగా ఆదేశించబడింది? ఆ కార్యకర్తల కళ్ళుగప్పి వీళ్ళు లోనికి ఎలా ప్రవేశించగలిగేరు? ...

ఈ రకమైన అనుమానాలతో అంతా సతమత మవు తూన్న సమయంలో ఆ వుభయులూ తమలో తాము నవ్వు

కుంటూ మెల్లిగా వేదిక దగ్గరకొచ్చేరు. 'ఎవరు మీరు ?' అని అడిగేరు నారాయణ శిరోమణిగారు.

'మేము ఎవరిమయితే నేం ? ... ప్రమాదకరమయిన వ్యక్తులం మాత్రం కాము.' అని సమాధానమిచ్చేడు రుద్రాక్ష మాల ధరించిన వ్యక్తి. అతనొక వైదిక బ్రాహ్మణుడి లాగు న్నాడు. వయస్సు పాతిక సంవత్సరా లుండొచ్చు.

"ఎందుకొచ్చె రిక్కడికి ?" నారాయణ శిరోమణిగారి ప్రశ్న.

"తల్లి ఉపదేశాన్ని వినడానికి !" స్నిగ్ధ కంఠముతో సమాధాన మిచ్చేడు అతని ప్రక్కనే నిలబడివున్న రెండో యువకుడు. ఇంకా చదువుకొంటున్న యువకుడిలా ఉన్నాడు. వయస్సు పద్ధెనిమిది లేక యిరవై సంవత్సరాలకు మించదు!... అతని కంఠస్వరం స్త్రీ కంఠస్వరములా యెంతో కమనీయంగా వుంది. సభలోగల అందరి దృష్టి అందాలుచిందే ఆ యువకుడి మీదే కేంద్రీకరింపబడింది.

"భారతీదేవిగారి ఉపన్యాసాన్ని మీరు పూర్తిగా విన్నారా ?" అని అడిగేరు నారాయణ శిరోమణిగారు వాళ్ళ ముఖాలలోకి పరిశీలనగా చూస్తూ.

"లేదు. మధ్యలో వచ్చేము. ఇలాంటి సమవేశాలను చాలా జాగ్రత్తగా కట్టుదిట్టంగా నిర్వహించాలి! ... మేమీ గ్రామానికి అపరిచితులం ! ... అపరిచితులను ఇలాంటి రహస్య

సమావేశాలకు రానివ్వకూడదు. ముఖద్వారం దగ్గర కావలా వున్నవారు భారతీదేవిగారి ఉపన్యాసం వినడంలో ప్రమత్తులై యుండడంవల్లే మేము లోనికి రాగలిగేము. కావలావారు ఎప్పుడూ అప్రమత్తులై యుండాలి. మేము గూఢచారులము కాముగాబట్టి సరిపోయింది ! ... లేకపోతే ఏమైయుండేదో ఆలోచించండి ! ...

"ఇంతకీ మీా రెవరు ?" అని సభాధ్యక్షులవారు అడిగేరు.

మహా విజ్ఞాని అయిన చాణక్య పండితులవారి శిష్యుణ్ణి నేను. నా పేరు శివప్రసాద్ ! ... నాకు జ్యోతిశ్శాస్త్రంతో కొంత పరిచయముంది. అతి త్వరలోనే యవన సామ్రాజ్యం మన దేశంలో అంతమొందే శుభసూచనలు కానవస్తున్నాయి! మా గురువుగారిచే బ్రహ్మాండమైన ఓ విప్లవ పథకం రూపొందించబడింది. ఆ పథకాన్ని మీాకూ త్వరలోనే తెలియజేస్తాను. అంతవరకూ లేనిపోని ఆవేశానికి లోనుకాకుండా శాంతచిత్తులై యుండండి! ...

బుద్ధిచేత సాధ్యంకాని పనిలేదు. భేదోపాయం బుద్ధిబల సాధ్యం ! ... ఈ భేదోపాయాన్ని పన్ని యెంతటి శత్రువుల నైనా జయించొచ్చు ! ... ఒక మహాసైన్యాన్ని ఎదుర్కొనే టందుకు తిరిగి అంతటి మహాసైన్యమే ఉండాలనేది బుద్ధిహీనుల భావన ! ... బుద్ధిబలసాధ్యమైన భేదోపాయాన్ని ప్రయోగించి ఎంతటి శక్తివంతులనైనా జయించొచ్చు ! ...

అంచేత మహాబలసంపన్నులైన యవనులను మన దేశంలోంచి పారద్రోలలేమేమోనని మీరధైర్యం చెందవద్దు. పథకమంతా రూపొందించబడింది ! ... త్వరలో మీకదంతా తెలియజేయబడుతుంది. అంత వరకూ శాంత చిత్తులై యుండండి !" అంటూ సభనంతటినీ ఓమారు కలయ జూసేడు శివప్రసాద్ !

సభికులలో రెచ్చగొట్టబడ్డ ఆవేశం కాస్త తగ్గింది ! ...

నారాయణ శిరోమణిగారు తన ఆసనంమీదనుంచి లేచి శివప్రసాద్ దగ్గరకెళ్ళి అతని వీపుపై గోముగా నిమురుతూ "భారతీదేవిచేత రెచ్చగొట్టబడ్డ ఈ ప్రజల ఆవేశాన్ని అదుపులో పెట్టేందుకు ఆ భగవంతుడే నిన్నిక్కడకు పంపినట్టున్నాడు. జ్యోతిశ్శాస్త్రంతో నీకు పరిచయ ముందన్నావు ! ... అయితే అలగ్జాండరు భవిష్యత్తుగురించి ఏమైనా చెప్పగలవా?' అనడిగేరు.

శివప్రసాద్ మెల్లిగా నవ్వి - "అలగ్జాండరుయొక్క భవిష్యత్తుగురించి చెప్పమంటారా ? ... చెప్పడాని కేముంది ! భారతీయుల పరాక్రమం అతన్ని తిరోగమింప జేస్తుంది !" ... అన్నాడు.

"అయితే వచ్చిన దారినే తిరిగి పోతాడంటావా ?"

"అలా పోలేడు - అతను దాటివచ్చిన భారత భూభాగంలో చాణక్య శిష్యులచే విప్లవ బీజాలు నాటబడ్డాయి.

అతనికి సర్వత్రా వ్యతిరేక వాతావరణం సృష్టించబడుతోంది. అలగ్జాండరీ సత్యాన్ని గమనించిన వెంటనే ఏదోవిధంగా సింధు నదీ ద్వారాన్ని చేరుకొని అటనుండి సముద్రమార్గాన ఇరాను దేశంచేరి అక్కడనుంచి తన దేశానికి పోవచ్చు! ... నేను అలగ్జాండరు జాతకాన్ని బాగా పరిశీలించేను ! అలగ్జాండరు ఒక భారతీయ వీర యోధుడిచే క్షతగాత్రు డవుతాడు. ఆ తరువాత దేశాన్ని వదిలిపెట్టి పోతాడు. ఒకటి రెండు సంవత్సరాలలోగా మరణిస్తాడు. ఆపై ఏడు మాసాలలోపలే భారత దేశంలో యవనులచే ఆక్రమించబడిన దే శా లన్నీ మళ్ళీ స్వాతంత్ర్యాన్ని ప్రకటిస్తాయి!" అన్నాడు శివ ప్రసాద్.

నారాయణ శిరోమణిగారు యింకా ఏవేవో అడగాలనుకున్నారు – కాని భారతీదేవి వారి మధ్యకొచ్చి 'నువ్వే కదూ నన్ను 'అమ్మా'అని యిందాక ఆ వెనకనుంచి పిలిచేవు?' అని అడిగింది శివప్రసాద్ ప్రక్కన నిలబడున్న యువకుడి ముఖములోకి అవ్యక్తమైన వాత్సల్యంతో చూస్తూ.

"అవునమ్మా!" అని సమాధాన మిచ్చేడా యువకుడు.

"నా కుమార్తె కంఠస్వరంలాగే వుంది నీ కంఠ స్వరం! పురుష వేషంలోవున్న నా పార్వతిలా నా కళ్ళకి నువ్వగుపిస్తున్నావు! ఎవరు నాయనా నువ్వు? ఏ తల్లి కన్నది నాయనా నిన్ను?" అని భారతీదేవి మాతృప్రేమానురాగరంజితురాలై అతని తలమీద గోముగా నిమురుతూ అడిగింది.

"కన్న పిల్లలు ఏ వేషంలోవున్నా - కంఠ ధ్వనినిబట్టి తన పిల్లల్ని యే తల్లి అయినా గుర్తించగలదు!" అంటూ తగిలించిన మీసాల్నీ, విగ్గునీ తీసివేసి 'అమ్మా' అంటూ తల్లిని కౌగలించుకుంది పార్వతి.

భారతీదేవి అంతులేని ఆనందంతో కుమార్తెను హృదయానికి హత్తుకొని ఆనందాశ్రువులు రాలుస్తూ -"చిట్టి తల్లీ! ఆ దుర్మార్గుల చేతుల్లోంచి నువ్వెలా తప్పించుకు రాగలిగేవమ్మా ? ... అని అడిగింది.

"ఈ శివప్రసాద్ గారి అసమానమైన ప్రజ్ఞాపాటవము వల్ల! ... వీరు నన్ను ... అని పార్వతి యింకా ఏదో చెప్పబోతుండగా ...

"ఊఁ! నా ప్రజ్ఞ గురించి నువ్విప్పుడు మీ తల్లి గారి యెదుట ఘనంగా వివరించనక్కరలేదు." అని సభాసదుల వేపు తిరిగి - "ఈ సభ యింతటితో ముగించబడింది. విప్లవ పథకం మీకు త్వరలోనే తెలియజేయబడుతుంది. అంతవరకు ఓపిక పట్టండి. ఇక మీరు ఇళ్ళకు వెళ్ళొచ్చు! అన్నాడు శివప్రసాద్.

సభాధ్యక్షులైన నారాయణ శిరోమణిగారు నిర్ఘాంతపోయారు. సభను ముగించేటందుకుగాని, కొనసాగించేటందుకు గాని అధికారం తన కివ్వబడింది. అట్టి అధికారం శివప్రసాద్ కి లేదు! ... కాని సభ ముగించబడినట్లు అతను ప్రకటించేసరికి సభలోగల వారెవ్వరూ అభ్యంతరం చెప్పకుండా నిశ్శబ్దంగా వెళ్ళిపోతూండడం చూసి చాలా ఆశ్చర్యపోయారు నారాయణ

శిరోమణిగారు. ఏదో దైవీయమైన శక్తి శివప్రసాద్ లో వుండుంటుందనుకున్నా డతను ! ...

♦ ♦ ♦ ♦ ♦

తెల్లారేవఱకూ తమ యింటిదగ్గరుండి విశ్రాంతి తీసుకోమని భారతీదేవి ఎంత బలవంతం చేసినా ఉండడానికి యిష్టపడక ఆ రాత్రే వెళ్ళిపోవడానికి సంసిద్ధుడయ్యేడు శివప్రసాద్.

'ఈ చీకట్లో మీరిప్పుడెక్కడకు వెళ్ళదల్చుకున్నారు ?' అనడిగింది పార్వతి.

"మశకావతీపురం !" అని సమాధాన మిచ్చేడు శివప్రసాద్.

"ఎందుకు ?"

"రమ్మనమని ప్రాంతీయ విప్లవ సంఘాధ్యక్షులవారు వర్తమాన మంపేరు. నిన్ను మీ అమ్మగారివద్దకు సురక్షితంగా చేర్చి వస్తా నని వారికి నేను వర్తమాన మంపేను. అంచేత నే నిప్పుడు మశకావతీపురం వెళ్ళక తప్పదు."

"మీచే నెలకొల్పబడ్డ పానశాల దారిలో నే కదా వుంది! ... అక్కడకుకూడా వెడతారా ?"

"వెళతాను !"

"అక్కడికి వెళ్ళకుండా మీరుండ లేరనుకుంటాను! " అంది పార్వతి నవ్వుతూ.

పార్వతి అలా ఎందుకందో అర్థంకాక ఆమె కళ్ళల్లోకి పరిశ్నార్థకంగా చూసేడు శివ ప్రసాద్.

'వివిధ రకాలైన మత్తు పానీయాలను తయారు చేసే వాళ్లు వాటిని రుచి చూడకుండా వుండగరంటారా? ఒకమాటు రుచి చూసేక వాటిని మరి వదలలేరోమోనని నా అనుమానం! ...

"ఓ! ... ఇదా నీ అనుమానం! ... అది నాచే వ్యక్తిగతంగా నెలకొల్పబడ్డ పానశాలకాదు. విప్లవ సంఘంచే నెలకొల్పబడ్డ పానశాలది! ... ఇటువంటి పానశాలలు కీలక ప్రాంతాలలో విప్లవ సంఘముచే చాలా నెలకొల్పబడ్డాయి. మధుపానాసక్తులయిన యవన సైనికులకు వినూత్నమయిన మత్తు పానీయాలనిచ్చి - వారి నాకర్షించి - వారి గుట్టుమట్లులను తెలుసుకోడానికి నియమించబడిన గూఢచారులే యీ రకమైన పానశాలల నిర్వాహకులు! ...

విషయసేకరణ కోసం నే నప్పుడప్పుడు ఆ పానశాలకు వెడుతూంటాను. స్వతహాగా త్రాగుబోతులైన యవన సైనికులను మరింత త్రాగుబోతులుగా తయారుచేసి వాళ్ళ నరాలను, గుండెలను నీరసింప జెయ్యడం విప్లవ సంఘంయొక్క ధ్యేయం! ఆ రకమైన పానశాలలో హిందువుల కిచ్చేవి కేవలం మధుర పానీయాలే!... నేను త్రాగేవి ఆ రకమైన మధుర పానీయాలు మాత్రమే!" అన్నాడు శివప్రసాద్ నవ్వుతూ.

యవన సైనికులచే బంధింపబడి బలవంతముగా గొంపో బడుతున్న పార్వతి ఆ పానశాల సమీపంలోగల అరణ్యంలో శివ ప్రసాద్ దృక్పథంలో పడింది.

వాళ్ళు నలుగురు సైనికులు! ... విడిపించడం ఏమంత కష్టం కాదనుకొన్నాడు శివ ప్రసాద్. కొద్ది నిమిషాలలో ఓ కల్లు గీత పనివాడిలా వేషం మార్చుకొని ఆ యవన సైనికుల దగ్గరకెళ్ళి – "ఓ పెభువులు! ... దయసేయండి బాబు! దయ సేత్తే రుసి సూపిత్తా!... రుసిసూత్తే కనిపిత్తాదండీ స్వారగం!" అని వాళ్ళను ఆ పానశాలకు తీసుకెళ్ళేడు.

అక్కడ పానీయాలందించే వ్యక్తి, కళ్ళలోకి సూటిగా చూస్తూ "పెభువులొచ్చేరు!... రంభనాటి పిల్లను తెచ్చిండ్రు. పరవశించి అనుభవిత్తారట! ... సూపించవోయ్ సామీ! మన పానీయల మజా!... గొంతుకు దిగేసరికి స్వారగం కనిపించాల!" అని శివప్రసాద్ గంభీరంగా అన్నాడు.

పానీయాల నందించే ఆ వ్యక్తి, కళ్ళు ఆనందంతో తళు క్కున మెరిసేయి. "తమరు మా పెభువులు! ... తమకు మరి యాద సెయ్యాల! దయసెయ్యండి బాబూ గదినోకి!" అని గదిలోకి ఆ సైనికులను సగౌరవంగా తీసుకెళ్ళి వారి నక్కడ ఆసీనులను చేసి – వంట శాలలోనికెళ్లి పరిశుభ్రమైన పాత్రల నిండా మద్యాన్ని నింపి – ఏదో కలిపి – వారి చేతికాపాత్రల నందించేడు! ...

వాళ్ళు స్వర్గానికెళ్ళారో, నరకానికెళ్ళారో తెలీదుకాని త్రాగిన తర్వాత కొద్ది క్షణాలలోనే నేలమీద కొరిగి పోయేరు ?...

"కొండ వెనకాలగల పాతాళ బిలం యిటువంటి వాళ్ళ శరీరాల నెన్నిటినయినా అతి రహస్యంగా యిముడ్చుకోగలదు! ఎవ్వరికీ ఏవిధమైన అనుమానం కలుగకుండా అతి రహస్యంగా చెయ్యాలీ పని !... జాగ్రత్త !" అని ఆ వ్యక్తి నాదేశించి పార్వతిని బంధ విముక్తురాలినిచేసి - 'అతి శీఘ్రంగా పురుష వేషం ధరించాలి నువ్వు !" అన్నాడు శివప్రసాద్.

"పురుష వేషం ధరించడ మెలాగో నాకు తెలీదు !" అని గొణిగింది పార్వతి.

"ఊ! ... సరే! ఎలాగ ధరించటమో నేను చెపుతాను!" అంటూ ఆమెను గదిలోకి తీసుకెళ్ళి పురుష వేషం ధరింపజేస్తూ 'నీ పేరేమిటి ? ... నీ దేవూరు ? ... నీ తల్లి దండ్రు లెవరు ?" అని అడిగేడు శివ ప్రసాద్.

పార్వతి దుఃఖాన్ని దిగమ్రింగుకొని - తన పేరేమిటో వూరేదో, తల్లిదండ్రు లెవరో తెలియజేసిన తరువాత జరిగిన విషాద గాథ నంతటినీ తెలియజేసింది. మార్గ మధ్యస్థంలో తమ చూడియావుని తన కళ్ళయెదుటే చంపి తిన్నారని అశ్రు పూరిత నయనాలతో చెప్పింది పార్వతి.

శివ ప్రసాద్ బాధగా నిట్టూర్చి- ఇప్పుడు జరిగిపోయిన విషయాలను తల్చుకొని ఎంత విచారించినా ప్రయోజనమేమీ

వుండదు! ... ఊఁ! ... సరే! ... మొదట నిన్ను మీ అమ్మ గారివద్దకు సురక్షితంగా చేర్చి - ఆ తరువాత నా పని చేసుకొంటాను!" అన్నాడు.

ఆ తరువాత కొద్ది నిమిషాలలో ఓ వైదిక బ్రాహ్మణుడిగా వేషం మార్చుకొని, పురుష వేషంలో ఉన్న పార్వతిని వెంటబెట్టుకొని వచ్చేడా గ్రామం!

ఈ విధంగా యవన సైనికుల బంధంలోంచి పార్వతిని విముక్తురాలిని చేసి ఆమె తల్లికామెను అప్పజెప్పేడు శివ ప్రసాద్!

వచ్చిన పని పూర్తయింది. అంచేత యిక వెళ్ళిపోడానికి సంసిద్ధుడయేడు శివ ప్రసాద్!

కాని పార్వతి కళ్లలోంచి వెలువడుతున్న మనోహరమైన కాంతి అతనిలో అణగి మణిగియున్న మధురాతి మధురమైన వాంఛను వెలికి తీసింది! ...

అత్యంత సౌందర్యవతియైన పార్వతిని వదిలిపెట్టి పోడానికి అతనికి మనస్కరించలేదు.

అయినా యిలాంటి మానసికోద్రేకాలకు, వాంఛలకు లొంగిపోయి కర్తవ్యంపట్ల నిర్లక్ష్యం వహించడం అవివేకమనే అభిప్రాయంతో - "నాలుగైదు రోజులలోగా మళ్లీ వస్తాను. ఈ ప్రాంతంలో విప్లవ బీజాలు నాటవల్సిన బాధ్యత నా మీద పడింది. అంచేత నీకోసం కాకపోయినా నా కర్తవ్యాన్ని

నిర్వహించేటందుకైనా నేను రాక తప్పదు. ఇక నేను వెళ తాను!" అని పార్వతితో చెప్పి - భారతీదేవితో- "వెళ్లొస్తాను!" అని చెప్పి ఆ చీకట్లో కలిసిపోయాడు శివప్రసాద్!

శివప్రసాద్ వెళిపోతూన్న వేపు పార్వతి నిశితంగా చూడసాగింది! ... భయంకరమైన చీకటి తప్ప ఆమె కింకేమీ కనిపించలేదు. ఆమె కళ్లు చెమ్మగిల్లేయి! ... "హే భగవాన్! అతన్ని సురక్షితంగా మళకావతీపురం చేర్చు!" అని మనసులో భగవంతుణ్ణి ప్రార్థించింది.

తన కుమార్తె కళ్ళు చెమ్మగిల్లడం భారతీదేవి గమనించింది. - "మరేం ఫరవాలేదమ్మా! అతను సురక్షితంగా మళకావతీపురం చేరుకోగలడు!" అంది భారతీదేవి.

"ఆ దారంతా చాలా ప్రమాదకరమైనదమ్మా! నాకెంచేతో చాలా భయంగా వుంది!" ... అంది పార్వతి రుద్ధ కంఠంతో.

"విప్లవకారులు వెళ్ళే మార్గాలన్నీ అలాగే వుంటాయి! అతన్ని ఆ భగవంతుడే కాపాడుతాడులే!" అంది భారతిదేవి.

"అతను సురక్షితంగా తిరిగొచ్చేటంత వఱకూ ఉపవాసముండి భగవన్నామ స్మరణ చెయ్యదల్చుకున్నాను." అంటూ తన గదిలోకి వెళ్ళిపోయింది పార్వతి.

భారతీదేవి నివ్వెరపోయింది! ... తన కుమార్తెకు అతనికి గల సంబంధమేమిటి? ... అతను సురక్షితంగా తిరి

గొచ్చేంతవరకూ ఉపవాసముండి భగవన్నామ స్మరణ చెయ్యవలసిన అవసర మేమొచ్చింది తన కుమార్తెకు ? – అతను తన కుమార్తెను రక్షించిన మాట నిజమే! ... అందుకు కృతజ్ఞతను యీ రూపంలో వ్యక్తపరచాలా ? ... తన కుమార్తె ధోరణి చూడబోతే అతన్ని ప్రేమిస్తూన్నట్లుగా ఉంది! అతను కూడా తన కూతుర్ని ప్రేమిస్తున్నట్లయితే ఈ వ్యవహారం తమ కుటుంబానికీలోకంలో తీరని కళంకాన్ని ఆపాదింపజేస్తుందని భయపడిందామె!

ఆమె అలా భయపడడానికి బలీయమైన ఓ కారణముంది! పార్వతికి ఎనిమిది సంవత్సరాలు నిండకమునుపే వివాహమయిపోయింది! ... అప్పటికామె భర్త వయస్సు పదహారు సంవత్సరాలు. తల్లిదండ్రుల బలవంతంవల్ల అతను వివాహం చేసుకొన్నాడేగాని, అతనికి మాత్రం వివాహం చేసుకోడం సుతరామూ యిష్టంలేదన్న సంగతి తీరా వివాహమయిపోయాక తెలిసింది! ...

వివాహమయిన తరువాత కొద్దిరోజులకే అతను ఎవ్వరికీ ఏమీ చెప్పకుండా ఎటో వెళ్ళిపోయేడు. వెళ్ళిపోయి పదేళ్ళపై చిలుకయింది! ఎక్కడికి వెళ్ళిపోయేడో, ఎందు కెళ్ళిపోయేడో ఎవ్వరికీ తెలీదు! ... చనిపోయుంటాడని కొంతమంది భావన! సన్యాసులలో కలిసుంటాడని కొంతమంది భావన! మొత్తానికి అతనేమయినదీ ఎవ్వరికీ నిశ్చయంగా తెలీదు!

ఈ స్థితిలో తన కుమార్తె శివప్రసాద్‌ని ప్రేమించి నట్లయితే అది ఎలా పరిణమిస్తుందోనని ఆమె భయం! తమ కుల కట్టుబాట్ల ప్రకారం మరో వివాహం చేసుకొనే అర్హత తన కుమార్తెకు లేదు.

తన గారాబు కూతురియొక్క హృదయములో శివ ప్రసాద్ చే విత్తబడ్డ ప్రేమబీజాలు మొలకెత్తకమునుపే వాటిని ఏరి పారెయ్యాలనుకుంది భారతీదేవి!

♦ ♦ ♦ ♦

తిరిగి రావడానికి నాలుగైదు రోజులు పట్టవచ్చని అనిన శివప్రసాద్ ఆ మర్నాటి సాయంత్రమే వచ్చేసరికి పార్వతి పరమానంద భరితురాలయింది.

భారతీదేవి చాలాఆశ్చర్యపోయింది. అతనసలు మకకావతీపురం వెళ్ళుండడని ఆమె అనుమానించింది.

"మళ్లీ వచ్చేసరికి నాలుగైదు రోజు లవుతుందన్నావు కదా; యింత తొందరగా వచ్చేశావేం?" అని అడిగింది భారతీదేవి.

శివప్రసాద్ భారతీదేవికి సమాధానం చెప్పకుండా పార్వతివేపు తిరిగి ఆమె కళ్ళలోకి కొంటెగాచూస్తూ "నేను తొందరగా వచ్చేశానంటావా పార్వతీ?" అనడిగేడు.

"నా మట్టుకి కొన్ని యుగాలు గడిచినట్టుంది!" అని గొణిగింది పార్వతి సిగ్గు బరువుతో కుంచించుకుపోతూ.

"ఊఁ! ... అలాగా? ... కాని మీ అమ్మగారి దృష్టిలో పూర్తిగా ఒక రోజయినా యింకా గడియలేదు! ... నేనింత తొందరగా వస్తానని మీ అమ్మగారు ఊహించి ఉండరు." అన్నాడు శివ ప్రసాద్.

"తిరిగొచ్చేసరికి నాలుగైదు రోజులవుతుందన్నవాడివి ఒక రోజయినా పూర్తి కాకుండానే వచ్చేయడంవల్ల వెళ్ళిన పని పూర్తి కాకమునుపే వచ్చేశావేమోననే అనుమానంతో యిలా అడిగేనేకాని మనస్సులో మరే దురుద్దేశ్యమూ పెట్టుకొని యిలా అడగలేదు!" అంది భారతీదేవి.

"వెళ్ళిన పని పూర్తి కాకమునుపే వచ్చేశానేమోననే అనుమానం మీకెందుకు కలిగింది?" అనడిగేడు శివప్రసాద్.

సమాధానం చెప్పడానికి సంశయించింది భారతీదేవి!

ఆమెనుండి మరి సమాధానము రాదని నిశ్చయించుకున్నాక – "మీకీ అనుమానం ఎందుకు కలిగిందో నాకు తెలుసు! ... మీ అమ్మాయికోసమే యింత శీఘ్రంగా నేనొచ్చేసుంటానని మీ అనుమానం! ... అవునా?" అని ఆమె ముఖ కవళికలను అవలోకించసాగేడు శివప్రసాద్.

ఔననిగాని, కాదనిగాని అనలేదామె! ... శివప్రసాదు వేపు! అయోమయంగా చూడసాగింది భారతిదేవి!

"మీ అమ్మాయి మెడలో వేలాడుతున్న మంగళ సూత్రాన్ని బలవంతముగా తెంచివేయడానికి నేనిక్కడికి

రాలేదు !" అని కొంచెంసేపు మౌనంగావూరుకొని ... దారిలో మీ అమ్మాయి నాకన్ని విషయాలూ చెప్పింది. నీచుడుగాని, పరదేశగతుడుగాని, ఘాతము చెయ్యదలచినవాడుగాని, పతితుడుగాని, నపుంసకుడుగాని భర్తయినట్లయితే అట్టి భర్తను వదిలిపెట్టి స్త్రీ పునర్వివాహం చేసుకోవచ్చని మా గురువర్యులైన చాణక్య పండితులవారు అర్థ శాస్త్రంలో రచించేరు. ఇది హైందవ స్త్రీ ధర్మానికి న్యాయంచేకూర్చే విషయము కాదని మీరు భావించినట్లయితే మీ కుమార్తె దౌర్భాగ్యానికి మీతోపాటు నేనూ విచారించడం తప్ప యిక చెయ్యగలిగేదేవీ వుండదు ! ... బాగా ఆలోచించండి ! నేనిప్పుడు ధాత్రుపురానికి శీఘ్రంగా పోవలసుంది. విప్లవకారులిప్పుడు ఈ గ్రామ పరిసర ప్రాంతాలలో అనేక వేషాలతో సంచరిస్తూ జృంభకాది విద్యలను ప్రదర్శిస్తూ సామాన్య ప్రజలలో ధర్మరక్షణాసక్తిని తీవ్రతరం చేయడానికి పూనుకున్నారు. యవన సైనికులచే మళ్ళీ ఏ ప్రమాదమూ వాటిల్లకుండా మిమ్మల్ని వారు కాపాడుతారు ! ధైర్యంగా వుండండి. నేను వెళ్ళొస్తాను" అని గబగబా వెళిపోతుంటే ...

"మళ్ళీ ఎప్పుడొస్తారు ?" అనడిగింది పార్వతి పొంగి వస్తూన్న దుఃఖాన్ని దిగమ్రింగుకొంటూ.

"ఏమో ! ... చెప్పలేను ! ... చాలా ప్రమాదకరమైన పథకాన్ని చేపట్టేను. ఇంత త్వరలో తిరిగి రాలేనేమో !" అన్నాడు వెళ్ళిపోతూ.

"అయితే మీరు వెళ్ళొద్దు!" అని బిగ్గరగా అఱచింది పార్వతి.

శివప్రసాద్ తనలో తాను నవ్వుకున్నాడు. మరి వెనుకకు తిరిగి చూడకుండా వెళ్ళిపోయేడు! ...

♦ ♦ ♦ ♦ ♦

సుమారు నెల రోజులు కావస్తోంది. ఇంకా శివప్రసాద్ తిరిగి రాలేదు. అతని కేదయినా ప్రమాదం వాటిల్లిందేమోననే అనుమానంతో పార్వతి చాలా ఆందోళన చెందసాగింది.

తల్లి ఎంత బ్రతిమాలినా పార్వతి అవాళ భోంచెయ్యలేదు! ... మనస్సు బాగులేనప్పుడు కటిక ఉపవాసాలు చేస్తూ భగవన్నామ స్మరణ చెయ్యటం పార్వతికి అలవాటు! ...

"ఇలా ఎన్నాళ్ళు ఆహారం తీసుకోకుండా ఉండదల్చుకున్నావు?" అనడిగిందామె తల్లి.

"అతను సురక్షితంగా తిరిగొచ్చేటంతవరకు!" అని సమాధానమిచ్చింది పార్వతి.

"నీకేం మతిపోయిందా ఏవిఁటి? - అతనొకవేళ తిరిగి రాకపోతే ఏం చెయ్యదల్చుకున్నావు?"

"చెప్పానుగా! - అతనొచ్చేటంతవరకూ నిరాహారినై భగవన్నామ స్మరణ చేస్తానని!"

"ఏడ్చినట్టుంది! ... నువ్విలా ఆహారం తీసుకోకుండా ఎన్నాళ్లు బ్రతగ్గలవ్?"

"శరీరంలో ప్రాణం ఉన్నంతవరకు!"

"బాగుంది వరస! అతగాడేదో వశీకరణ మంత్రాన్ని నీమీద ప్రయోగించినట్లున్నాడు! అంచేతే నువ్విలా ఉచితా నుచిత జ్ఞానాన్ని పోగొట్టుకొని మాట్లాడుతున్నావ్. ఇంతకీ అతగాడు నీకేమవుతాడనే యింతలా యిదవుతున్నా వతని గురించి?"

పార్వతి నీరసంగా నవ్వి-"అతనునా కేఁవీ కారంటావా? యవన సైనికులచే సర్వ నాశనం కాబోతున్న నన్ను అతి చాకచక్యంగా రక్షించిన మనిషి నా కేఁవీ కారంటావా?" అని అడిగింది.

"అటువంటి మనిషిని దైవాంశ సంభూతుడిగా భావించి ఆరాధించు. లేదా ఓ సోదరుడిగా భావించి ప్రేమించు. అంతే కాని మరొక రకంగా అతన్ని ప్రేమించే అర్హత నీకు లేదు!"

"ఏం? ఎంచేత లేదు?"

"నీ కిదివరకే పెళ్ళి అయిపోయింది గనక!"

పెళ్ళంటే ఏవిఁటో తెలియని చిన్న వయస్సులో పెళ్ళి అంటే యిష్టంలేని వ్యక్తికి నన్నిచ్చి పెళ్ళిచేసేరు మీరు! ... కట్టుకున్న పెళ్ళాంగతి ఏమవుతుందనే జ్ఞానమైనాలేకుండా పెళ్ళయిన తరువాత కొద్దిరోజులలోనే అత నెక్కడికో వెళ్ళిపోయేడు. ఇప్పటికి పదేళ్లు పూర్తయేయి. నేటివరకూ అతని ఉనికి ఎవ్వరికీ తెలీదు. అతనిచే నేను మంగళసూత్రం కట్టించు

కున్న మాట మాత్రం నిజం! ... కాని అతనితో నాకీనాటి వరకూ ఎవ్విధమైన సంబంధమూ లేదు. ఇటుపైని ఉండదు కూడా!”

“ఛీఛీ! ఏఁవిటే ఆ మాటలు? ఎవరైనా వింటే నవ్విపోతారు!”

“ఎందుకు నవ్వుతారు? ఏ దోషమూ లేని నన్ను వదిలిపెట్టిపోయిన భర్తతో నాకే సంబంధమూ లేదనటంలో తప్పేమైనా వుందంటావా?”

అయ్యయ్యో! ... నీకు పూర్తిగా మతిపోయింది. నీకెలా బోధపర్చడమో నా కవగతం కాలేదు! నీ యీ తల్లి వంశ గౌరవ ప్రతిష్ఠలకు కళంక మాపాదించే పనేదీ చెయ్యొద్దని తల్లిగా నిన్ను నేను అర్థిస్తున్నానమ్మా!” అందామె అశ్రుపూరిత నయనాలతో.

పార్వతి బాధగా నిట్టూర్చి “అలాగేలే!” అంటూ తన గదిలోకి పోయి భడాలున తలుపువేసి లోన ఘడియ వేసేసింది.

భారతీదేవి ఆఁదోళనతో ఆ గది దగ్గరికెళ్ళి–‘పార్వతీ! నా కేదో భయంగావుందే! నువ్వు తలుపు తియ్యకపోతే నన్ను చంపుకు తిన్నంత ఒట్టు!” అంటూ తలుపు గ్రుద్దసాగింది. తన కూతురేదైనా అఘాయిత్యానికి ఒడిగడుతుందేమోనని ఆమె భయం!

గది లోపలనుంచి ఏ సమాధానమూ రాకపోవడంవల్ల ఆమె భయం ద్విగుణీకృత మయ్యింది.

భారతీదేవి మరి భరించలేకపోయింది! ... తన నుదుటిని ఆ తలుపుకేసి బాదుతూ- "పార్వతీ! నా తల బ్రద్దలయిపోయేటంతవరకూ నువ్వు తలుపు తియ్యవా ?" అని డగ్గుత్తికతో భారతీదేవి అంటున్నప్పుడు శివప్రసాద్ అక్కడికొచ్చి "ఇలా తలుపుకేసి నెత్తి బాదుకుంటున్నా రేవిఁటండీ? ... మీ కేం పిచ్చెత్తిందా ఏవిఁటి ?" అనడిగేడు.

భారతీదేవి త్రుళ్లిపడి శివప్రసాద్ వేపు చూసింది. తనను తాను సంబాళించుకుంటూ - 'నాకు కాదు; పార్వతికి పిచ్చెక్కింది' అంది రుద్ధ కంఠంతో.

"ఏదీ ? ... ఎక్కడుంది ?" అనడిగేడు శివ ప్రసాద్ ఆందోళనతో.

"ఈ గదిలో ఉంది!" అని చెప్పింది భారతీదేవి.

శివప్రసాద్ తలుపు గట్టిగా గ్రుద్దుతూ "పార్వతీ! ... నే నొచ్చేను! తలుపు తియ్యి!" అని బిగ్గరగా అన్నాడు.

కొద్ది క్షణాల అనంతరం తలుపు తెరచి ద్వారబంధం దగ్గర నిలబడింది పార్వతి.

తన కుమార్తెనుచూసి నిర్ఘాంతపోయింది భారతీదేవి.

కాషాయాంబరాలు ధరించి - ఒకచేత కుంకుమపూసిన త్రిశూలం, వేరొకచేత నల్లనిపాత్ర పట్టుకొని అపర చండీదేవి లాగ అగుపిస్తున్న కుమార్తె వేపు చూడలేక గట్టిగా కళ్లు

మూసుకుందామె. ఆమె నేత్రాలలో అంతవరకూ నిలచివున్న కన్నీరు బొట బొటమని క్రిందకు జారిపోయింది.

శివ ప్రసాద్ చాలా ఆశ్చర్యపోయినప్పటికీ త్వరలోనే తేరుకొని పార్వతిని ఆపాదమస్తకం తిలకించి "నే నే వేషమైతే నీచేత వేయించదల్చుకున్నానో అదే వేషం నువ్వు వేసేవు! నీకీ వేషం బాగా నప్పింది." అని అన్నాడు.

శివ ప్రసాద్ యిలా అనేసరికి భారతీదేవితోపాటు పార్వతికూడా నివ్వెరపోయింది!

"మీ ఇంట్లో సన్యాసిని వేషానికి కావలసిన సరంజామా అంతా ఉండదేమోననే అనుమానముతో నేనంతా పట్టుకొచ్చేను. ఇంతకీ ఈ వేషానికి కావలసిన సరంజామా అంతా మీ యింట్లో ఎందుకుంది?" అని అడిగేడు.

"సన్యాసిని అయిన నా మేనత్తగారు మా యింట్లోనే చనిపోయేరు. ఆమె ఆస్తే యిదంతా!" అని ప్రశాంతముగా సమాధాన మిచ్చింది పార్వతి.

"ఈ వేషం నీకు బాగా నప్పింది. ఏదో దివ్య తేజస్సు నీ ముఖంలో కనిపిస్తోందిప్పుడు." అన్నాడు శివ ప్రసాద్.

"నా ముఖంలో మీకిప్పుడు కనుపిస్తున్న తేజస్సు మా అమ్మకు కనిపించకపోవచ్చు! మా అమ్మ దృష్టికి నా ముఖమిప్పుడు కళావిహీనంగా కన్పించొచ్చు!" అంది పార్వతి.

భారతీదేవి దిగులుగా చూచింది కూతురివేపు!

"అమ్మా!... మన వంశ గౌరవ ప్రతిష్ఠలకు నా మూలంగా కళంకం రాకుండా ఉండాలీ అంటే నేనింత కంటే యింకేం చెయ్యాలమ్మా?" అనడిగింది పార్వతి దుఃఖాన్ని దిగమింగుకొంటూ.

ఈ ప్రశ్నతో భారతీదేవి బాగా కుంగిపోయింది. మరి దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది. ఓ చిన్నపిల్లలా వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

" ఏమిటమ్మా యీ ఏడుపు? ... ఆ నాడు సభలో మీ రిచ్చిన ఉపన్యాసాన్ని మరచిపోయారా?" అనడిగేడు శివప్రసాద్.

"లేదు నాయనా లేదు! కానీ ..." మరి వాక్యాన్ని పూర్తి చెయ్యలేకపోయింది భారతీదేవి. తన దుఃఖాన్ని బయటకు కనిపించనివ్వకుండా దాచుకొనే ఉద్దేశముతో ముఖాన్ని చీరె కొంగులో దాచుకుంది.

"స్త్రీ పురుషులంతా విప్లవోద్యమంలో పాల్గొని ఎవరి శక్తికి తగినట్లుగా వారు పని చెయ్యకపోతే విప్లవలక్ష్యం నెరవేరదు! పార్వతి నిప్పుడు నాతోపాటు మళకావతీపుర సమీపానగల దుర్గమ వనానికి తీసుకెళ్ళి అక్కడున్న యోగానందులవారిచే గురూపదేశము చేయించాలనుకుంటున్నాను." అని కొంచెంసేపు మౌనంగా వూరుకొని "ఏం పార్వతీ! నువ్వు సిద్ధంగా వున్నావుకదూ?" అనడిగేడు శివప్రసాద్.

అంగీకార సూచకంగా తలూపింది పార్వతి,

"నన్నొక్కర్తినీ యింటిదగ్గర వదిలిపెట్టి వెళ్ళిపోతా వుటే ?" అని కూతుర్ని అడిగింది భారతీ దేవి గద్గదిగ స్వరంతో.

"ఆడపిల్ల కన్నవారింట్లో ఎంతకాల ముంటుంది ? ... మరో యింటికి ఎప్పటికైనా వెళ్ళిపోవలసిందేగా ?" అన్నాడు శివప్రసాద్ నవ్వుతూ.

భారతీదేవి నవ్వలేదు. అలా అని ఏడవనూలేదు !

"ఇదొట్టి అమాయకురాలు. విప్లవమంటే ఏంవిటో దీనికి తెలీదు. నా హృదయం యేదో కీడును శంకిస్తున్నది నాయనా !" అంది భారతీదేవి.

"నా బొందిలో ప్రాణ మున్నంతవరకూ మీా అమ్మాయికి యెవరివలనా యే హానీ జరుగదని హామీానిస్తున్నాను. మీారేమీ బెంగ పెట్టుకోకుండా నిశ్చింతగా వుండండి !" అన్నాడు శివప్రసాద్.

వెళ్ళేముందు పార్వతి తల్లి పాదాలకు నమస్కరించి ఆశీర్వదించమంది.

పొంగి వస్తూన్న దుఃఖాన్ని ఆపుకొనే యాతనలో తన కుమార్తె తలమీాద చెయ్యివేసి యేదో అస్పష్టముగా గొణిగిందామె. అసలామె ఆశీర్వదించిందో లేదో ! ...

♦ ♦ ♦ ♦

తన రెండేళ్ళ కుమారుడైన రణజిత్తును మశకావతి రాజ్యానికి రాజుగా నభిషేకించి యవన సేనానులలో ఒకడైన ఫిలిప్‌కి తన శరీరాన్ని అప్పజెప్పి నిరంకుశంగా రాజ్యాన్ని పరిపాలించసాగింది కలాపినీదేవి.

యవన సైనికులు చేస్తున్న దోపిడీలను, అన్యాయాలను, అక్రమాలను సహించలేక– ఈ అరాచకాన్ని అరికట్టించవలసిందని రాణీ కలాపినీదేవిని ప్రార్థించేరు ప్రజలు.

యవన సైనికుల నెలాగైనా సంతుష్టిపరచి రాజ్యాన్నెలాగైనా నిలుపుకోవాలనే స్వార్థ తృష్ణగల కలాపినీదేవి ప్రజల ప్రార్థనను వినిపించుకోలేదు.

అటువంటి నీచురాలిని ఏంచేసినా పాపంలేదనే భావం ప్రజలలో బాగా వ్యాపించింది. రాణిపట్ల సహజంగా వుండవలసే భక్తిప్రపత్తులు ప్రజలలో హరించుకు పోయేయి.

ఏ పరిస్థితినయితే చాణక్య శిష్యులు వాంఛించేరో అదే పరిస్థితి ఏర్పడింది ! ...

చాణక్యుని సహాధ్యాయులలో ఒకడు యోగి వేషాన్ని ధరించి యోగానందుడనే పేరుతో మశకావతీ పురానికి తూర్పువైపునగల దుర్గమ వనంలో శిష్య సమేతంగా తిష్ఠ వేసేడు.

అతని శిష్యులు నానావిధాలైన వేషాలతో ప్రజల మధ్యకు పోయి యోగానంద యోగియొక్క మహిమలను గోరంతలు కొండంతలుగాచేస్తూ సామాన్య ప్రజానీకములో విశేషంగా ప్రచారం చెయ్యసాగేరు.

తనను దర్శించడానికి వచ్చే ప్రజలకు తన మహాత్మ్యాన్ని చూపి వారికి తనపట్ల విశేషమైన భక్తి ప్రపత్తులు జనింపజేయ సాగేడు.

క్రమక్రమముగా ప్రజలకు ఆ యోగివేషధారితో సన్నిహితమైన సంబంధం ఏర్పడసాగింది.

భగవద్గీతాసారాన్ని, ఆర్ష ధర్మాలను సుబోధకమైన భాషలో ప్రజలకు తెలియజెయ్యసాగేడు యోగానందుడు.

అతని శిష్యులు గ్రామాలలో పర్యటిస్తూ ప్రజలలో దైవ భక్తిని పెంపొందింప జేసేటందుకు పూనుకున్నారు.

గోపూజలు, వృషోత్సర్జనలు, సప్తాహాలు మొదలైనవి జరిపించసాగేరు. భజన మందిరాలను స్థాపించి గ్రామీణులను తరచుగా సమావేశ పరుస్తూండేవారు.

ఈ రకమైన దైవపూజా కార్యక్రమాలవల్ల, పండితుల సదుపదేశాలు వినడంవల్లా స్వధర్మంపై చెదరిన అభిమానం తిరిగి ప్రజలలో ప్రోగుపడసాగింది.

యవనులచే అతి దారుణంగా హింసింపబడ్డ వారందరూ తరచుగా సమావేశ మవుతూండడంవల్ల - వారిలో చక్కని ఐకమత్య మేర్పడింది.

చాణక్యుని సహాధ్యాయులలో మరొకడు ఉడురాజ దైవజ్ఞుడనే పేరున కార్తాంతిక వేషం ధరించి ప్రజలకు శుభాశుభ ఫలాలను చెపుతూ - ప్రశ్న జాతక సిద్ధాంతాల భాగా

లలో అసమానమైన ప్రతిభను వెల్లడించి ప్రజలలో మంచి పలుకుబడి సంపాదించేడు. భారత దేశంలో యవన సామ్రాజ్యం అంతమొందే కాలం దగ్గిరపడిందని చెపుతూ ప్రజలలో స్థైర్యమును పెంపొందింపజేస్తూ వారిని సత్వర కర్తవ్యోన్ముఖుల గావించసాగేడు.

అశ్వజిత్తు తమ్ముడు, కలాపినీ దేవి మఱిది అయిన ప్రసేనజిత్తు జాతకాన్ని పరిశీలించి -"నీకు త్వరలోనే రాజయోగం పట్టనున్నది!" అని చెప్పేడు. ప్రసేనజిత్తు త్వరలోనే మశకావతీ రాజు కాగలడని ప్రజల్లో రహస్యంగా ప్రచారం చెయ్యసాగేడు. ప్రసేనజిత్తు ఆనాటినుంచీ తను రాజయే అవకాశం కోసం ఎదురుచూచుచూ, యవననాశనాన్ని ఆకాంక్షించుచూ ప్రజలకు నాయకుడయేడు. చాలామంది యువకులను చేరదీసి అతి రహస్యంగా సైనిక శిక్షణ గరపసాగేడు.

చాణక్యుని సహాధ్యాయులలో యింకొకడు గణేశసేన వైద్యరాజనే పేరుతో భిషగ్వేషం ధరించి మశకావతీపురంలోను, ఆ చుట్టుప్రక్కల గ్రామాలలోను గొప్ప పేరు ప్రఖ్యాతుల నార్జించేడు. అసాధ్యమనుకున్న రోగాల నెన్నింటినో కుదురుస్తూండడంవల్ల పేదసాదలకు ఉచితముగా వైద్యము చేస్తుండడంవల్ల, ప్రజల కష్టసుఖాలన్నిటిలోను పాలు పంచుకొంటూ తగిన సహాయం చేస్తుండడంవల్లా ఆ ప్రాంతంలో గల ప్రజలందరికీ అతనెంతో ప్రేమపాత్రుడయేడు.

గణేశసేనవైద్యరాజు గొప్ప ప్రతిభావంతుడైన వైద్యుడని, ఎటువంటి రోగాన్నయినా అతి శీఘ్రంగా కుదర్చగలడని యవన ప్రతినిధి అయిన ఫిలిప్ చాలామంది చెప్పగా విన్నాడు. అతను చాలా కాలంనుంచీ అజీర్ణశీల రోగంతో చాలా బాధ పడుతున్నాడు. ఆ రోగాన్ని కుదర్చడానికి యవన వైద్యులు యెంతోమంది ప్రయత్నించేరు. తగ్గలేదు సరికదా; వ్యాధి మరింత ఎక్కువయింది. ఇక తమ యవనవైద్యులవల్ల ఆ రోగం కుదరదనే నిశ్చయానికి వచ్చి గణేశసేన వైద్యరాజుకి రమ్మనమని కబురు చేసేడు ఫిలిప్.

ఆ పిలుపుకోసమే కాచుకు కూర్చున్నాడు వైద్యరాజు.

వెళ్ళేడు! ...

ఏ వ్యక్తిని అంతమొందించడానికి యీ పథకము రూపొందించబడిందో ఆ వ్యక్తి ఒక రోగిగా తన చేతికి చిక్కినందుకు చాలా సంతోషించేడు గణేశసేన వైద్యరాజు.

మొదట ఫిలిప్‌కి తనమీద బాగా నమ్మకం కలిగేటట్లు చెయ్యాలనే తలంపుతో అతన్ని చాలా కాలంనుంచీ పట్టి పీడిస్తున్న జబ్బుని అనతి కాలంలోనే నయం చేసేడు. అందువల్ల గణేశసేన వైద్యరాజుపై ఫిలిప్‌కి అమితమైన విశ్వాసం కుదిరింది. ఇక నేం? ... గణేశసేనుడు రాజ వైద్యుడవడానికి యిక ఏ అభ్యంతరమూ లేకపోయింది.

యవన సైనికులకు వచ్చే ప్రమాదకరమైన రోగాలనన్నింటినీ అతి శీఘ్రముగా కుదుర్చుచుండుటవల్ల వారందరికీ

గణేశసేనుడు ఎంతో ప్రియమయిన వాడయేడు. యవనుల కిచ్చే ఔషధాలను వాళ్ళు త్రాగే సారాయిలో కలిపి యిస్తూ వుండడంవల్ల వాళ్ళా ఔషధాలను యెంతో ఆప్యాయంగా సేవిస్తుండేవారు! ... గుండెను, నరాలను నీరసపరిచే పదార్థాలను చేర్చి మహాసురను స్వయంగా తయారుచేసి వాళ్ళకిస్తుండేవాడు. సమయం చిక్కినపుడల్లా యవనులకు హిందూ దేవతల యొక్క మహిమలను తెలియజేస్తూ; రోగాలను కేవలం మందులతోనేగాక జప హోమ పూజాదులచేత, మంత్రములవల్ల నివారించొచ్చని వాళ్ళకి నమ్మకం కలిగించేటందుకై కొన్ని కథలల్లి చెపుతూండేవాడు.

ఈ రకంగా గణేశసేనుడు యిటు సామాన్య ప్రజలకు, అటు పరిపాలకులకు విశ్వాసపాత్రుడైనాడు.

◆ ◆ ◆ ◆

ఆనాడు శివప్రసాద్ యోగానందుడిని దర్శించి "స్వధర్మోద్ధరణాభిలాషిణి అయిన ఓ సన్యాసిని మీ దర్శనం కోసం వచ్చింది. తమ ఆజ్ఞ అయితే యిక్కడకు తీసుకొస్తాను." అని అన్నాడు.

యోగానందుడు ప్రసన్న వదనంతో శివప్రసాద్ వేపు చూస్తూ "సన్యాసినా ? ... లేక సన్యాసినీ వేషధారిణా ?" అనడిగేడు.

"నేనుమాత్రం ఆమెచేత వేషం వేయించలేదు!" అని నవ్వుతూ సమాధానమిచ్చేడు శివప్రసాద్.

"అయితే స్వయంగా తనే వేషం వేసుకున్నదన్న మాట!" అని చిన్నగా నవ్వి - సరే! ... లోనికి తీసుకురా. అని అన్నాడు.

పార్వతిని లోనికి తీసుకొచ్చేడు శివప్రసాద్.

ఆమె భక్తి ప్రపత్తులతో యోగానందుని పాదాలకు నమస్కరించి "స్వామీ! ... నన్ను మీ శిష్యురాలిగా స్వీకరించి కర్తవ్యాన్ని ఉపదేశించండి!" అని ప్రార్థించింది.

"బాగా ఆలోచించే నువ్వీ జీవిత పథంలోకి అడుగు పెట్టేవుకదూ?" ఆమె ముఖ కవళికలను నిశితంగా పరిశీలించుచూ ప్రశ్నించేడు యోగానందుడు.

'ఊఁ!' అని మూలిగింది పార్వతి.

'సన్యాసాన్ని స్వీకరించేటందు కవసరమగు ఇంద్రియ నిగ్రహ శక్తి, మనస్థైర్యము నీకున్నయో లేవో పరీక్షించి ఆ తరువాత గురూపదేశం చేస్తాను." అని పార్వతితో అని - శివప్రసాద్ వేపు తిరిగి "ఈమెను మన గణేశసేన వైద్యరాజు దగ్గరకు తీసుకెళ్ళు. కర్తవ్యమేఁవిటో అతనే తెలియజేస్తాడు." అని చెప్పి యోగ సమాధిలో మునిగిపోయినవాడిలా కళ్ళు మూసుకున్నాడు యోగానందుడు.

శివప్రసాద్ ఆమెను గణేశసేన వైద్యరాజు యింటికి తీసుకెళ్ళి — ఆమె గురించి వివరంగా అతనికి అన్ని విషయాలు తెలియజేసేడు.

"ఓ సన్యాసినిగా నీ జీవిత శేషాన్ని గడపాలనే కోరిక నీకెందుకు కలిగింది ?" అని పార్వతి నడిగేడు గణేశసేన వైద్య రాజు.

ఏమని సమాధానం చెప్పడమా అని పార్వతి ఆలోచిస్తుంటే—"నీకీకోరిక ఎందుకు కలిగిందో నాకు తెలుసు! ... నీ భర్త నిన్ను వదిలిపెట్టిపోకుండా వున్నట్లయితే నీకీ కోరిక కలుగుండేదేకాదు! ... ఏఁవంటావు ?" అనడిగేడు గణేశసేనుడు.

పార్వతి ఏఁవీ అనలేదు.

నీ భర్త మరిరాడనే నిశ్చయానికి నువ్వెందుకొచ్చేవు? ఇంతకీ నీ భర్త ఎలాగుంటాడో నీకు తెలుసా ? ... నీ అదృష్టం బాగుండి ఒకవేళ నీ భర్త నీ యెదుటపడితే నువ్వు గుర్తించ గలవా ? అనడిగేడు వైద్యరాజు.

"ఎనిమిదేళ్ళయినా నాకు నిండకమునుపే నా వివాహ మయిపోయింది. అసలు నా పెళ్ళే నాకీనాడు సరిగ్గాగుర్తులేదు. అటువంటిది యిన్నేళ్ళ తరువాత నేనతన్ని ఎలా గుర్తుపట్ట గలను ? నిజానికి పెళ్ళికి ముందుగాని, పెళ్ళినాడుగాని నేనతన్ని సరిగ్గా చూడలేదు. అతని రూపానికి సంబంధించిన స్మృతి నాలో ఈనాడు అస్పష్టంగానైనా మిగలలేదు!" అంది పార్వతి.

"ఇప్పుడు నీ ప్రక్కనిలబడున్న శివప్రసాద్ నీ భర్తేమో ననే అనుమానం నీ కింతవరకూ కలగలేదా ?" అని గణేశసేన వైద్యరాజు అడిగేసరికి పార్వతి కళ్లు సంభ్రమాశ్చర్యాలతో తళుక్కున మెరసేయి. ఆమె ఒకసారి శివప్రసాద్ ముఖంలోకి

ఓరగా చూసి సిగ్గు బరువుతో కుంచించుకుపోయింది. ఆమె శరీరమంతా అనిర్వచనీయమైన ఆనందంతో పులకించింది ! ...

శివ ప్రసాద్ చకితుడై "ఏఁవిటి మీ ఉద్దేశమన్నట్లు" వైద్యరాజువేపు ప్రశ్నార్థకంగా చూసేడు. వైద్యరాజు కళ్ళతోనే ఏదో సమాధానం చెప్పేడతనికి. ఇదేదో క్రొత్త పథకమయుంటుందని గ్రహించి మౌనంగా నిలబడ్డాడు శివ ప్రసాద్.

గణేశసేన వైద్యరాజు —"ఆ పరమేశ్వరుని లీలలు మహా అద్భుతమైనవి ! అంటూ పార్వతి దగ్గరకెళ్ళి ఆమె తల మీద వాత్సల్యంతో నిమురుతూ — "పార్వతీ ! ... అచ్చు నీ లాగే ఉండే మనవరాలొకర్తి నాకుండేది. అది యవన సైనికులచేత అపహరించబడింది. ఏఁవయిందో యీనాటి వరకు తెలీదు ! నిన్ను చూస్తుంటే దాన్ని చూస్తున్నట్లుగానే నేనిప్పుడు అనుభూతి నొందుతున్నాను ! ... అరె ! ... నా మతి మండా ! ... ఇంతసేపై నిన్ను గుమ్మంలోనే నిలబెట్టి మాట్లాడుతున్నాను ! ... ఇంట్లోకి పదమ్మా ! ... తన కుమార్తె ఇంటికి తిరిగివచ్చినంతలా సంబరపడే మనిషొకామె యింట్లో వుంది." అంటూ పార్వతిని యింట్లోకి తీసుకెళ్ళేడు.

ఆనాడు పార్వతి పొందిన సంతోషానికి మేరలేదు !

♦ ♦ ♦ ♦

ఒక రోజున పార్వతిని కలాపినీదేవి అంతఃపురానికి తీసుకెళ్ళి—"ఈమె నా మనుమరాలు ! ... పేరు పార్వతి. భారత

రామాయణాలను చదివింది. తమ రనుగ్రహిస్తే, అప్పుడప్పు డొచ్చి పురాణ కాలక్షేపం చేస్తూంటుంది!" అన్నాడు గణేశ సేన వైద్యరాజు.

"సరే!... అలాగే! ... నాకూ యీ మధ్య బొత్తిగా కాలక్షేపంకాకుండావుంది. రేపటినుంచీ పంపించండి." అంది కళాపినీదేవి.

ఈ రూపంలో అంతఃపుర ప్రవేశానికి అనుమతి లభించింది.

అనతి కాలంలోనే కలాపినీదేవియొక్క ఆదరాభిమా నాలను, విశ్వాసాన్ని చూరగొంది పార్వతి.

ఇంకో విశేషత ఏమిటీ అంటే కలాపినీదేవి కుమారుడు రణజిత్తుకి పార్వతి దగ్గర విపరీతమైన చనువేర్పడింది.

తాతగారియొక్క ఆదేశానుసారమే ఆబాలుణ్ణి అంతలా చేరదీసింది పార్వతి.

పార్వతే పాలు త్రాగించాలి; పార్వతే అన్నం తిని పించాలి; పార్వతే ఎత్తుకోవాలి; పార్వతే జోల పాడుతూ నిద్రబుచ్చాలి అన్నంత అధికంగా ఆ బాలుడి ప్రేమకు పాత్రు రాలైంది పార్వతి.

ఒక రోజున గణేశసేన వైద్యరాజు ఓ చిన్న మందు పొట్లం పార్వతి చేతికిచ్చి -"ఈ పొట్లంలోవున్న మందుని అతి రహస్యంగా పాలలో కలిపి రణజిత్తుచేత త్రాగించాలివాళ!

ఎవ్వరికీ ఏ విధమైన అనుమానం కలుగకుండా అతి చాక చక్యంగా నువ్వీ పని చెయ్యాలి!" అన్నాడు.

పార్వతి ముఖం వివర్ణమయింది. అతనివేపు అనుమా నంతో చూస్తూ- "ఏ జబ్బూలేని బాలుడికి మందివ్వాల్సిన అవసర మిప్పుడేమొచ్చింది తాతగారూ?" అనడిగింది.

"ఏ జబ్బూ లేదుకాబట్టే మందివ్వాల్సిన అవసర మేర్ప డింది!" అన్నాడు గణేశసేన వైద్యరాజు.

"ఈ పని నేను చెయ్యలేను తాతగారూ!... ఇది విష మేమోనని నా కనుమానంగా వుంది. మీ ప్రేరేపణ వలన ప్రారంభంలో కృత్రిమమైన వాత్సల్యాన్ని ప్రదర్శించి ఎంతో ప్రేమున్నట్లుగా నటించి చేరదీసేను. కాని యిప్పుడు నేను మరి నటించలేను. ఆ బాలునిపై నిజంగానే వాత్సల్య మేర్ప డింది! కన్న తల్లికన్నా మిన్నగాభావించి నన్ను ప్రేమిస్తున్న ఆ పసివాడికి ఏ విధమైన అన్యాయం జరిగినా నేను సహించ లేను." అంది పార్వతి.

"కన్నకొడుకుకన్నా మిన్నగాభావించి నువ్వాబాలుడిని అత్యంత వాత్సల్యంతో చూస్తున్నప్పుడు, నేనా బాలుడికి అన్యాయం ఎందుకు చేస్తాను చెప్పు?... ఇంతకీ యిది విషం కాదు!... ఆ బాలుడికి నీ మీద మరింత ప్రేమాభిమానా లను జనింపజేస్తుందీ మందు. అంచేత ఏమీ సంశయించకుండా నేను చెప్పినట్లు చెయ్యి." అన్నాడు.

గణేశసేన వైద్యరాజుపై గల విశ్వాసంతో పార్వతి ఆ మందుని పాలలో కలిపి రణజిత్తుచే త్రాగించేసిందా నాడు! ...

ఆ పని చేసిందేకాని పార్వతి హృదయం విపరీతంగా ఆరాటపడసాగింది. రణజిత్తుకి ఏ ఆపదా రాకుండా కాపాడమని భగవంతుడికి మొక్కింది.

నెల దినాలు గడిచేయి!

ఆనాడకస్మాత్తుగా రణజిత్తుకి తీవ్రమైనజ్వరమొచ్చింది. గుడ్లు మిటకరించి కాళ్ళూ చేతులూ టప టప కొట్టుకొంటూ వంటిమీద స్పృహ లేకుండాపడివున్న తన కుమారుడి పరిస్థితి చూసి చాలా ఆందోళన చెందసాగింది కలాపినీ దేవి.

నెల రోజుల క్రితం గణేశసేనవైద్యరాజిచ్చిన మందును పాలలో కలిపి రణజిత్తుచే త్రాగించడంవల్లే యీ జబ్బొచ్చిందేమోననే అనుమానం కలిగింది పార్వతికి.

తన అనుమానం నిజమైతే మహా భయంకరమైన నరకంలో తప్ప తనకు మరెక్కడా చోటుండదనుకుందామె!...

"హే భగవాన్! ... ఈ బాలుడి ప్రాణాలను నిలబెట్టి నన్నీ మహాపాపంలోంచి విముక్తురాలిని చెయ్యి." అని భగవంతుడిని ప్రార్థించసాగింది పార్వతి.

ఫిలిప్‌కి యీ విషయం తెలిసింది. గణేశసేన వైద్యరాజుని తక్షణమే రప్పించేడు.

గణేశసేనుడు బాలుని నాడి చూసి పెదవి విరచి "ఈ వ్యాధి చాలా ప్రమాదకరమైనది. ఏడు రోజులపాటు మన యీ బాలరాజు ప్రాణాలను నేను నిలుపగలను. ఆపైని నా వశంకాదు. ఇది యేదో గ్రహదోషంవల్ల వచ్చిన వ్యాధిలాగ వుంది. గ్రహ దోషాన్ని తెలుసుకొని తగిన శాంతి కృత్యాలను జరిపించినట్లయితే ప్రయోజన ముండొచ్చు!" అన్నాడు.

"తాతగారూ! ... ఈ గ్రహ దోషానికి విరుగుడైన మందేదీ మీ దగ్గర లేదా?" కన్నీళ్లొత్తుకుంటూ రుద్ధ కంఠముతో అడిగింది.

"గ్రహ దోషాలు మందులవల్ల పోవమ్మా! ... తగిన గ్రహశాంతి కృత్యాలు జరిపించడంవల్ల గ్రహ దోషాలు నివారింపబడతాయి. నేను ఏడు రోజులవరకూ ప్రాణాలు నిలబెడతాను. ఈలోగా మంచి దైవజ్ఞుని రప్పించి శాంతి కృత్యాలు చేయించే ఏర్పాట్లు తక్షణం చేయించినట్లయితే ప్రయోజన ముండొచ్చు! ... అని చెప్పేడు వైద్యరాజు.

ఈ గ్రహ దోషాన్ని పరీక్షించడంకోసం ఆ ప్రాంతంలో మంచి పేరు ప్రఖ్యాతులు పొందివున్న ఉడురాజ దైవజ్ఞుని రప్పించేరు.

అతడు చాలా గ్రంథాలు తిరగేసి – లెక్కలుగట్టి "ఈ గ్రహదోషం నివారించేటందుకు శివ సప్తాహం చెయ్యాల్సి వుంటుంది. ఏడు రోజులు అహోరాత్రుళ్లు పూజాభిషేకాలు చేయించాలి." అని చెప్పేడు.

ఈ పూజా కార్యక్రమమంతా యథావిధిగ నిర్వహించే టందుకై ఆ ప్రాంతంలో సుప్రసిద్ధ పరివ్రాజకుడిగా పేరొందిన యోగానందుడిని ప్రార్థించి ఒప్పించి రప్పించారు.

కోట ప్రాకారంలోని విశాల ప్రాంగణంలో పెద్ద శివ లింగం ప్రతిష్ఠింపబడింది.

యోగానందుడి అధ్వర్యంలో శివ సప్తాహం ప్రారంభ మయింది. నడి వయస్సులోవున్న అందమైన తెల్లని వృషభానికి తప్తశూల చిహ్నాలుంచి శివ వాహనంలా స్వేచ్ఛగా తిరగ డానికి వదిలిపెట్టేరు. శివ వాహనంగా వదిలిపెట్టబడిన ఆ వృష భానికి పళ్ళు. ధాన్యాదులు పెడుతూ, పూల దండలతో అలంక రిస్తూ పూజించసాగేరు ప్రజలు.

ఈ శివ సప్తాహంలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీక రించడంకోసం వివిధ గ్రామాలనుండి ప్రజలు తండోప తండ ములుగా రాసాగేరు. ఈ రకంగావచ్చే ప్రజలలో అధిక సంఖ్యాకులు చాణక్య శిష్యులచే ప్రభావితులైనవారు. యవన సైనికులచే ఏవైనా అత్యాచారాలు జరగొచ్చని అట్టి పరి స్థితిలో వాళ్ళ నెదిరించి కసి తీర్చుకొనేటందుకై కత్తులను కఱ్ఱలలోను, వీలైతే దుస్తులలోను గుప్తపరచి వెళ్ళవలసిందని ముందుగానే హెచ్చరించారు చాణక్య శిష్యులు.

అలగ్జాండరు మరణించేడనేవార్తను శిష్యులు తెలుసు కొని ఆ వార్తకు విశేషమైన ప్రచారాన్నిచ్చేరు. ఇందువల్ల

వెనుకంజ వేస్తున్న ప్రజలు మరింత ఉత్సాహంతో విప్లవంలో పాల్గొనేటందుకు ధైర్యంగా ముందుకొచ్చేరు.

అశ్వజిత్తు సోదరుడైన ప్రసేనజిత్తుచే అతి రహస్యంగా సైనిక శిక్షణపొందిన యువకులు సామాన్యపౌరుల వేషాలతో శివసప్తాహాన్నిచూసే మిషతో మళకావతీపురానికి చేరుకున్నారు. మరికొంతమంది సన్యాసుల వేషాలతో త్రిశూలాలను ధరించి కోటలోనికి ప్రవేశించేరు. కొంతమంది స్త్రీలుకూడా చిన్న చిన్న కత్తులను చీరె కుచ్చెళ్ళలోపల భద్రపరచి కోటలోనికి ప్రవేశించేరు.

అవాళ ఏడవ రోజు! ...

ఆ నాటితో శివ సప్తాహం పూర్తవుతుంది.

యోగానందుని ఆధ్వర్యంలో జరుగుతున్న శివ సప్తాహ మహోత్సవాన్ని చూడడానికి వివిధ గ్రామాలనుండి వచ్చిన జనులతో మళకావతీపురం కిక్కిరిసిపోయివుంది.

పూజాపురస్కారాలు యథావిధిగ జరుగుతున్నాయి.

అవాళ ఉదయం బాలరాజుకి కొంచెము స్వస్థత చేకూరింది.

శివపూజా మహిమవల్లే బాలరాజుకి క్రమక్రమముగా స్వస్థత చేకూరుతున్నదని నగరమంతటా వెల్లడి చేయుబడింది.

యువన సైనికులీ సంగతిని విని యెంతో ఆశ్చర్యపోయేరు. గణేశసేన వైద్యరాజు తమకు చెబుతూన్న కథలు కల్పితమైనవి కావని అవన్నీ యదార్థమైనవే అయుంటాయని

అప్పుడనుకున్నారు. హిందూ దేవత ప్రభావంపై వారికానాడు బాగా నమ్మక మేర్పడింది !

ఆనాటి రాత్రి పెద్ద ఎత్తున జరగబోయే శివపూజా మహోత్సవాలను కనులారచూసి తరించేటందుకై యవన సైనికులందరికీ సెలవిచ్చేసేడు ఫిలిప్ !

గణేశసేన వైద్యరాజానాడు బాగా మత్తెక్కించే పదార్థాలను చేర్చి మహాసురను తయారు చేయించేడు చాలా పీపాల నిండా !

యవన సైనికులంతా ఆ మహాసురను మహాప్రీతితో కడుపెక్క తాగి ఒళ్ళుమైమరచి తిరగసాగేరు.

సగం రాత్రి గడిచింది !

శివమెత్తిన వారిలా వూగిపోతూ కొంతమంది భజనలు చేస్తున్నారు.

అంతట గంభీరమైన స్వరంతో —"ఆశించిన ఫలితం సిద్ధించబోయే సమయం దగ్గర పడింది ! శివపూజా మహిమను వీక్షించేటందుకు అందరూ సంసిద్ధులు కండి !" అని హెచ్చరించేడో వ్యక్తి.

అదే సమయంలో కోట ఉత్తర ద్వారం వేపునుండి ఏదో పెద్దగోల వినిపించింది. ఏఁవిటా గోలఁటూ అంతా లేచి నిలబడ్డారు.

"శివ వాహనంగా విడిచిపెట్టిన వృషభేశ్వరుని యవన సైనికులు చంపి మాంసాన్ని కాల్చుకు తింటున్నారు. పరమ పవిత్రమైన శివ వాహనాన్ని చంపిన వారిని ఎంతమాత్రం క్షమించ కూడదు. అటువంటి దుర్మార్గులను నిలువునా చీల్చి వెయ్యాలి. రండి! రండి! అనే కేకలు మిన్ను ముట్టేయి. ఆ కేకలు దుర్భేద్యములైన కోట ప్రాకారాలను దాటి బయటకు వ్యాపించేయి.

దాచి ఉంచిన అయుధాలను బయటకుతీసి వీరావేశంతో అటువైపు బయలుదేరారంతా!...

గణేశసేనుడిచ్చిన మహాసుర త్రాగడంవల్ల నరముల బలహీనతతో నీరసంగా పడివున్న యవన సైనికులు ఎదిరించే శక్తిలేక చంప వచ్చిన ప్రజలకు శరీరాలప్పజెప్పి కుప్ప కుప్పలుగా కూలిపోయారు.

కంటబడ్డ యవనసైనికులందరినీ నిర్దాక్షిణ్యంగా హాత మార్చేశారు. చాలా కాలం నుంచీ పరాభవానలాన్ని హృదయాలలో దాచుకొని కసితీర్చుకొనే సమయం కోసం ఎదురు చూస్తున్న ప్రజలందరికీ అదొక మహోత్సాహ సంభరితమైన కార్యమయింది.

నాటిరాత్రి మహాకాళుడు ప్రళయ తాండవం సలిపి నట్లయింది.

ప్రమాదాన్ని గుర్తించి పారిపోడానికి ప్రయత్నించిన ఫిలిప్‌ని పట్టుకొని బరబర యీడ్చుకొనివచ్చి శివలింగం యెదుట నిలబెట్టి త్రిశూలాన్ని అతని కడుపులో గ్రుచ్చి చంపి వేశారు.

ప్రజల క్రోధం యింకా చల్లారలేదు. శత్రు పక్షాన యింకెవరైనా మిగిలున్నారా అని ఆలోచించేరు! కలాపినీదేవి వారికి గుర్తొచ్చింది. అంతఃపురంలోకి పరుగెత్తేరు.

కుమారుణ్ణి హృదయానికి హత్తుకొని ప్రాణభీతితో గజ గజ వణికిపోతున్న కలాపినీరాజ్ఞిని చూచి ఎవరూ జాలిపడ లేదు.

క్షణంలో ఆమె తల క్రిందకు తెగి పడింది!

క్రిందపడి ఏడుస్తున్న బాలరాజుని హతమార్చడానికి ఓ సైనికుడు కత్తి నెత్తేసరికి పార్వతి అడ్డుగా వెళ్ళి "ఈ బాలుడు నిరపరాధి. ఇతన్ని వధించవద్దు!" అని దుఃఖంతో బిగ్గరగా అరచింది.

ఆ సైనికుడు పార్వతిని ప్రక్కకు తోసివేసి "మోహాంధు రాలై దేశద్రోహానికి ఒడిగట్టిన నీచురాలికి పుట్టిన బిడ్డకూడా అటువంటి బుద్ధికలవాడే అవుతాడు!" అంటూ అతి నిర్దాక్షి ణ్యంగా ఆ బాలుణ్ణి నరికేశాడు.

ఆ హృదయవిదారకమైన దృశ్యాన్ని చూసి పార్వతి కెవ్వున కేకవేసి మూర్ఛిల్లింది! ...

"బహుశా యీ దౌర్భాగ్యురాలు కలాపినీదేవి సంబంధీకురాలయుంటుంది! ... దీనినికూడా నరికి పారేస్తే తీరి పోతుంది!" అంటూ కత్తి నెత్తేడు ఆ సైనికుడు.

అంతట్లో శివప్రసాద్ అతని వెనుకనుండి వచ్చి కత్తిని పట్టుకొని - "ఈమె ఎవరో తెలుసా ? మన వైద్యరాజుగారి మనవరాలు! ... ఎంత ఆవేశంలోవున్నా మనవాళ్ళెవరో, పరాయివాళ్ళెవరో గుర్తించి మరీ మెలగాలి! ఈ బాలరాజు వధతో శివ సప్తాహ హోమానికి పూర్ణాహుతి గావించడ మయింది. ఇక శాంతించు." అని వారించేడు.

ఆపిమ్మట ఒక శుభదినాన ప్రజామోదంతో ప్రసేనజిత్తు మశకావతీ పరిపాలనా బాధ్యతను స్వీకరించేడు.

♦ ♦ ♦ ♦

ఏ పాపం ఎరుగని బాలుడైన రణజిత్తుని చంపిన సైనికుడిని శత విధాల నిందించి- "ఇది చాలా ఘోరమైన అన్యాయం!" అని శివప్రసాద్‌తో అంది పార్వతి.

"నీలాంటి కరుణార్ద్రహృదయుల దృష్టికి యిదొక ఘోర మైన అన్యాయముగా కన్పించొచ్చు! ... కాని ప్రస్తుతము మశకావతీ రాజ్య సింహాసనాన్ని అధిష్టించిన ప్రసేనజిత్తు దృష్టిలో యిది అన్యాయంకాదు. అతని ప్రోత్సాహంవల్లే ఆనాడా సైనికుడు బాలుడైన రణజిత్తును సంహరించుంటాడని నా అనుమానం!" అన్నాడు శివప్రసాద్.

"ఈ ప్రపంచంలో రాజకీయాలంత భయంకరమైనవి, క్రూరమైనవి యింకేవీ ఉండవు!" అంది పార్వతి.

శివప్రసాద్ ఫకాలున నవ్వి "రాజకీయాలను సృష్టించే వాళ్ళు మనుష్యులేనన్న సంగతి మరచిపోయి మాట్లాడుతున్నావ్! నీ ఈ సిద్ధాంతం ప్రకారం నేనుకూడా క్రూరుడనే అవుతాను!" అన్నాడు.

"స్వధర్మ రక్షణకోసం పాటుపడే మీవంటివాళ్ళను క్రూరులని ఎవరనగలరు?"

"శత్రుపక్షీయు లనగలరు!"

"శత్రువులంతా నిర్జింపబడ్డారుగా!"

"ఇంకాలేదు! మన దేశంలో యింకా కొంత ప్రాంతం యవనుల ఆధీనంలోనే వుంది. చాణక్యులవారి అద్భుత చాకచక్యంవల్ల యవన విజిత దేశాలలో లేవదీయబడ్డ బ్రహ్మాండమైన విప్లవోద్యమం యవన చక్రవర్తిని విసిగింపజేసి ఈ దేశాన్ని విడిచి వెడలిపోయేటట్లు, మనోవ్యాధితో మంచాన పడి మరణించేటట్లు చేసింది! ... యవన విజిత దేశాలన్నీ త్వరలోనే స్వాతంత్ర్యాన్ని ప్రకటిస్తాయి!"

"యవన విజిత దేశాలన్నీ స్వాతంత్ర్యాన్ని ప్రకటించేటంతవరకూ యీ విప్లవోద్యమము కొనసాగుతుందనుకొంటాను!"

"విప్లవ సంఘు లక్ష్యం అదికాదు! - భారత దేశంలో గల స్వతంత్ర దేశాలన్నింటినీ బలిష్ఠమైన ఒకే ఒక కేంద్రి

ప్రభుత్వ పరిపాలనక్రిందకు తీసుకొచ్చేటంతవరకూ యీ విప్ల వోద్యమం కొనసాగుతూనే వుంటుంది.

"ఇది అసాధ్యమైన కార్యమేమో!"

"ఎంతమాత్రం కాదు! ... మహా ప్రజ్ఞావంతులైన చాణక్యులవారిచే సృష్టింపబడ్డ యీ విప్లవోద్యమము అనతి కాలంలోనే లక్ష్యాన్ని సాధించగలదు. దుర్బలుడు, దుష్టుడు అయిన మహాపద్మనందుని సంహారించి మంచి గుణవంతుడు, బలసంపన్నుడు అయిన చంద్రగుప్తుని మగధ సామ్రాజ్యాభిషిక్తునిజేసి అఖండ భారత సామ్రాజ్యాన్ని స్థాపించి భవిష్యత్తులో ఏ విదేశీయులూ భారతదేశంవేపు కన్నెత్తి చూడకుండా చెయ్యాలని చాణక్యులవారి సంకల్పం! ...

"ఈ సంకల్పం ఒకవేళ నెరవేరినా భారత దేశమంతా ఒకే ఒక కేంద్ర పరిపాలనక్రింద ఎంతోకాలం వుండదేమోనని నా అనుమానం! స్వార్థపరులు, నీచులు. స్వధర్మ భ్రష్టులు అయిన రాజులు స్వతంత్ర రాజ్యాలను స్థాపించడానికి ఎప్పుడూ కుట్రచేస్తూనేవుంటారని నా భావం!... మళ్ళీ భారత దేశంలో యిలా చిన్న చిన్న స్వతంత్ర రాజ్యాలు ఏర్పడితే విదేశీయ దురాక్రమణకు స్వాగతం పల్కినట్లవుతుంది!"

"నీ అభిప్రాయాన్ని పూర్తిగా కొట్టిపారెయ్యటానికి వీల్లేదు. ఈ దేశంలో వైదిక మతం క్షీణించి, బౌద్ధమతం బాగా విస్తరిల్లినట్లయితే ఆయుధబలం, క్షాత్ర తేజం క్షీణించిపోతాయి.

అప్పుడు విదేశీయులు మన దేశాన్ని సులభంగా ఆక్రమించగలరు ! ... ఏది ఏమైనా ఏకచ్ఛత్ర సామ్రాజ్యంయొక్క శాంతి భద్రతలు దండనీతిపైనే ఆధారపడుంటాయి ! క్షాత్ర తేజం, ఆయుధ శక్తి సామ్రాజ్య సుస్థిరతకు ప్రాణంవంటివి. అవి దుర్బలమయినట్లయితే సమస్త ధర్మాలు, శాస్త్రాలు, కళలు, అన్ని సౌఖ్యాలు కుంటుపడుతాయి. దేశ ప్రాదేశిక సమగ్రత, సౌభాగ్యం అతులిత బలసంపన్నమైన సైనిక శక్తి మీదనే ఆధారపడుంటాయి. ఈ సత్యాన్ని మనమెప్పుడూ మరచిపోకూడదు !"

"ఏమిటో!... మీరు చెప్పేదంతావింటూంటే మానవులెప్పుడూ కుక్కలకన్నా అన్యాయంగా కాట్లాడుకుంటారని, యుద్ధాలు, రక్తపాతం లేకుండా శాంతియుతంగా జీవించలేరని అనిపిస్తున్నది! ఈ ప్రపంచంలో శాంతియుత సహజీవనం అసంభవమంటారా ?"

"ఎప్పుడైతే యీ ప్రపంచంలోగల మానవులంతా ఏకోన్ముఖులై ఒకే ఒక ఆధ్యాత్మికలక్ష్యాన్ని సాధించేటందుకు ప్రయత్నిస్తారో అప్పుడు శాంతియుత సహజీవనం సాధ్యమవుతుంది ! ... అంతవరకూ అది సాధ్యంకాదు !"

"ఏమిటో ! ... ఈ రాజకీయాలంటే నాకు పరమ అసహ్యం !"అంది పార్వతి.

"పోనీ ఇహ యీ విషయాలగురించి మాట్లాడొద్దులే ! మన ప్రేమగురించి మాట్లాడుకుందాం ! ... నువ్వు నన్ను

హృదయపూర్వకంగా ప్రేమిస్తున్నావు కదూ ?" అని నవ్వుతూ అడిగేడు శివప్రసాద్.

పార్వతి యే సమాధానం చెప్పకుండా సిగ్గుతో ముఖాన్ని ప్రక్కకు త్రిప్పుకుంది.

"నువ్వు నన్ను ప్రేమిస్తున్నా లేకపోయినా నిన్ను మాత్రం నేను ప్రేమిస్తున్నాను! ... ఎలాగో తెలుసా ? ... ఇలాగ !" అంటూ ఆమెను బిగియార కౌగలించుకున్నాడు.

ఆ కౌగిలిలోంచి విడివడడానికి పార్వతి ప్రయత్నించ లేదు !

అదే సమయంలో ఆ గది దగ్గరకొచ్చిన భారతీదేవి ఆ దృశ్యాన్ని ఆ గది కిటికీలోంచి చూసి వాళ్ళ ఆనందానికి తను అడ్డు తగలకూడదనే ఉద్దేశ్యంతో అతి నిశ్శబ్దంగా అక్కడి నుంచి వెళ్ళిపోయింది. శివ ప్రసాద్‌ని తన అల్లుడిగా భావించడం వినా యిహ తను చెయ్యగలిగిందేదీ లేదనుకుందామె!

(సమాప్తం)

*

[కృష్ణాపత్రిక 1967 మే 20, 27, జూన్ 3వ తేదీ సంచికల నుండి]

ఈ రచనకై పరిశీలింపబడిన గ్రంథములు :-

1. ఆర్య చాణక్యుడు

By విద్వాన్ వేదుల సూర్యనారాయణ శర్మ

2. స్వర్ణ పత్రములు

By శ్రీ స్వాతంత్ర్య వీర సావర్కార్

3. Hindu Polity

By Jyasual R. P.

4. Early History of India

By Vincent Smith.